నిర్భయవార్త
సంపాదకీయం
శనివారం 29 ఆగష్టు 2026

# నేపాల్ విషాదం

నేపాల్‌లో ఆకస్మిక వరదలు విరుచుకుపడి 350 మందికి పైగా ప్రాణాలు కోల్పోవడం, 1,300 మందికి పైగా ఆచూకీ తెలియకపోవడం అత్యంత విషాదకరం. ఇది ఇటీవలి కాలంలో హిమాలయ ప్రాంతంలో చోటుచేసుకున్న అత్యంత దారుణమైన ప్రకృతి విలయం. మంచు, రాళ్లు, మట్టి, నీరు కలిసి సృష్టించిన ఉధృత ప్రవాహం గ్రామాలను ముంచెత్తింది. ఇళ్లు, వాహనాలు, కార్యాలయాలు, విద్యుత్ మౌలిక వసతులు కొట్టుకుపోయాయి. 35 మోటారు వంతెనలు, 45 వేలాడే వంతెనలు, సుమారు 40 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నాయి. కొన్ని గ్రామాలు ఆనవాళ్లు లేకుండా పోయాయి. మృతుల సంఖ్య, ఆస్తి నష్టం ఇంకా పూర్తిగా తేలాల్సి ఉంది. కైలాస మానస సరోవర్ యాత్రకు వెళ్లిన అనేకమంది భారతీయులు ఈ ఆకస్మిక వరదల్లో చిక్కుకున్నారు. తమిళనాడు, పశ్చిమ బెంగాల్, ఇతర రాష్ట్రాలకు చెందిన 288 మంది యాత్రికులు ఈ వరదల్లో గల్లంతైనట్టు సమాచారం. ఇషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కైలాస యాత్రకు వెళ్లిన 77 మందితో కూడిన బృందం వరద ప్రవాహంలో కొట్టుకుపోయింది. తమవారు ఎక్కడున్నారో తెలియక కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి. భారత ప్రభుత్వం నేపాల్, చైనా అధికారులతో సంప్రదింపులు జరుపుతోంది. హిమాలయ ప్రాంతాలను సందర్శించే భారతీయుల భద్రతకు ప్రత్యేకమైన విపత్తు నిర్వహణ, అత్యవసర సమాచార వ్యవస్థ అవసరం ఎంత ఉందో ఈ ఘటన స్పష్టం చేస్తోంది. ఈ దారుణ విపత్తుకు కారణం సాధారణ భారీ వర్షపు వరద కాదు. భూకంపం కారణమని ప్రారంభంలో భావించినా, దాని తీవ్రత అంతగా లేదని నేపాల్ అధికారులు అంటున్నారు. భీకర వరదలకు కారణమయ్యేంత భారీ వర్షపాతం కూడా నమోదు కాలేదని మరొక పరిశీలన. మంచుపెళ్లలు, పెద్ద పెద్ద రాళ్లు, మట్టి విరిగిపడడంతో నదీ మార్గంలో అడ్డంకి ఏర్పడి, పెద్ద ఎత్తున నీరు వెనుకకు చేరిందని; ఆ అడ్డంకి ఒక్కసారిగా తెగిపోవడంతో మంచు, రాళ్లు, మట్టి, నీరు కలిసి అత్యంత వేగంతో ప్రవాహం దిగువకు దూసుకొచ్చిందని అంటున్నారు. భోటేకోశి నదిలో మొదలైన ఈ ఉధృత జలరాశి ఒక్కసారిగా త్రిశూలి నదిపై పడింది. కొన్ని ప్రాంతాల్లో నది నీటిమట్టం అరగంటలోనే 15 మీటర్లకు పైగా పెరిగింది. పెద్ద బండరాళ్లు, చెట్లు, మట్టి, మంచు, నిర్మాణాల అవశేషాలతో కూడిన ప్రవాహం అత్యంత విధ్వంసకరంగా మారింది. గంటకు 180 కిలోమీటర్ల వేగంతో సాగుతూ ఆ మార్గంలోని ప్రతి చెట్టునూ, నిర్మాణాన్నీ ఊడ్చుకుపోయింది. ఈ వైపరీత్యాన్ని అప్పటికప్పుడు గుర్తించినా, మనుషులు పరుగెత్తి తప్పించుకోవడం, వాహనాలతో దూరంగా వెళ్లడం కూడా సాధ్యం కాలేదు. చూస్తుండగానే జలవిలయం భీకరంగా ముంచెత్తింది. హిమాలయాల్లో జరుగుతున్న పర్యావరణ మార్పుల నేపథ్యంలో ఈ ఘటనను పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఉష్ణోగ్రతలు పెరగడం, మంచు నిల్వలు తగ్గడం, శాశ్వత మంచు పొరలు బలహీనపడటం, కొత్త హిమానీనద సరస్సులు ఏర్పడటం వంటి పరిణామాలు పర్వత ప్రాంతాల స్థిరత్వంపై ప్రభావం చూపుతున్నాయి. ఫలితంగా మంచు, రాళ్లు విరిగిపడటం, సరస్సులు ఒక్కసారిగా తెగిపడటం వంటి ప్రమాదాలు పెరుగుతున్నాయి. హిమాలయాలు ఆసియాలోని అనేక ప్రధాన నదులకు ఆవిర్భావ కేంద్రాలు. అక్కడ జరిగే ప్రతి మార్పూ కోట్లాది ప్రజల జీవనంపై ప్రభావం చూపుతుంది. కాబట్టి హిమాలయాల పర్యావరణ పరిరక్షణను దక్షిణాసియా భద్రతకు సంబంధించిన అంశంగా చూడాలి. సంబంధిత దేశాలు సమన్వయంతో వ్యవహరించి విపత్తులు నష్టదాయకంగా మారకుండా జాగ్రత్త వహించాలి. నదులకు దేశాల సరిహద్దులు తెలియవు. నేపాల్ పర్వత ప్రాంతాల్లో సంభవించే ఆకస్మిక ప్రవాహాలు బీహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లోని కొన్ని ప్రాంతాలపైనా ప్రభావం చూపుతాయి. అందువల్ల భారత్, నేపాల్, చైనా మధ్య వాతావరణ సమాచారాన్ని తక్షణమే పంచుకునే వ్యవస్థ అత్యవసరం. మనదేశంలో ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మేఘాలయ ప్రాంతాల్లో కొన్నేళ్లుగా ఆకస్మిక వరదలు భారీ నష్టాన్ని కలిగిస్తున్నాయి. 2021లో ఉత్తరాఖండ్‌లోని చమోలీ ప్రాంతంలో జరిగిన భారీ మంచు, రాళ్ల ప్రవాహం జలవిద్యుత్ ప్రాజెక్టులను ధ్వంసం చేసి వందలాది మందిని బలిగొంది. 2023లో సిక్కింలో హిమానీనద సరస్సు ఒక్కసారిగా ఉప్పొంగడంతో తీస్తా నది ఉధృతంగా ప్రవహించి భారీ విధ్వంసం సృష్టించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు తమ అభివృద్ధి నమూనాపై పునరాలోచించాలి. పర్వత ప్రాంతాల్లో, నదీ పరివాహక ప్రాంతాల్లో నిర్మాణాలకు పరిమితులు కచ్చితంగా పాటించాలి. హిమాలయాలను కేవలం పర్యాటకానికో, తీర్థయాత్రలకో, జలవిద్యుత్ ఉత్పత్తికో పరిమితం చేయకుండా అత్యంత సున్నితమైన పర్యావరణ వ్యవస్థగా గుర్తించి విధానాలు రూపొందించాలి. హిమానీనద సరస్సులు, కొండచరియలు, నదీ ప్రవాహాలను నిరంతరం పర్యవేక్షించే వ్యవస్థను బలోపేతం చేయాలి. ఉపగ్రహ చిత్రాలు, రాడార్ పరిశీలనలు, భూకంప పరికరాలు, నీటిమట్టం, వర్షపాతం కొలిచే కేంద్రాలను అనుసంధానించాలి. నదులకు పూజలూ, పుష్కరాలూ పేరిట కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్న పాలకులు ఆ నదుల పరిరక్షణపైనా, పెను విపత్తులు తలెత్తని పద్ధతుల్లో సద్వినియోగం చేసుకోవడంపైనా శ్రద్ధ పెట్టాలి. ప్రకృతి ప్రమాదాలను ఆపలేకపోయినా, వాటిని ముందుగానే గుర్తించి సంసిద్ధం కావడం ద్వారా ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. విపత్తు వచ్చిన తర్వాత సహాయక చర్యలు చేపట్టడం ఎంత ముఖ్యమో, దానికి ముందే భద్రత, హెచ్చరిక వ్యవస్థలను ఏర్పాటు చేయడం అంతకంటే ముఖ్యం. నేపాల్ విషాదం మనకు చేస్తున్న హెచ్చరిక ఇదే!

# ఆఖరి వరకూ అభ్యుదయ ఉద్యమాలతోనే...

వల్లిపల్లి సుమతి...కృష్ణా జిల్లా కాటూరు గ్రామంలో పుట్టారు. తల్లి లక్ష్మీ తులసి, తండ్రి నాగభూషణం. అభ్యుదయ భావాలు కలిగిన కుటుంబం వీరిది. అంతేకాదు, ఆమె పుట్టిన కాటూరు అభ్యుదయ భావాలకు, మహిళా ఉద్యమానికి పుట్టినిల్లు. మానికొండ సూర్యావతి, రాజేశ్వరమ్మ, కడియాల బుల్లెమ్మ నాయకత్వంలో అప్పట్లో మహిళా ఉద్యమం నడిచేది. మూఢనమ్మకాలకు, ఛాందస భావాలకు వ్యతిరేకంగా మహిళల్లో, యువతలో పెద్ద ఎత్తున ప్రచారం చేసేవారు. అలాగే స్త్రీ విద్య, వితంతు పునర్వివాహాలు, కులం మతం పట్టింపులు లేని సమాజం కోసం అనేక ఉద్యమాలు అక్కడి నుండే జరిగేవి. అలాంటి చోట పుట్టి పెరగడం వల్ల సుమతిపై కూడా ఆ ప్రభావం పడింది.?



### అప్పట్లోనే సాంకేతిక విద్య...

సుమతి వాళ్లు ముగ్గురు అక్కచెల్లెళ్లు, నలుగురు అన్నదమ్ములు. ఆర్థికంగా అంతంత మాత్రమే. అయినప్పటికీ నాగభూషణం దంపతులు తమ పిల్లలను బాగా చదివించారు. ఆ రోజుల్లో 'ఆడపిల్లలకు చదువెందుకు?' అని అందరూ అనుకునేవారు. కానీ ఆయన తన ముగ్గురు ఆడపిల్లల్ని సాంకేతిక విద్యలో ప్రోత్సహించారు. అంతేకాదు, గ్రామంలోని మిగతా ఆడపిల్లలను కూడా చదివించమంటూ తల్లిదండ్రులను ప్రోత్సహించేవారు. ఇంట్లో సుమతినే పెద్ద కూతురు. ఆమె సివిల్ ఇంజనీరింగ్‌లో డిప్లొమా చేసి, ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం సంపాదించింది. పి.మధును కులాంతర వివాహం చేసుకుంది. అప్పటికే మధు పార్టీలో పూర్తికాలం కార్యకర్తగా ఉన్నారు. తన చెల్లెళ్లను చదివించడంతో పాటు వాళ్లు కూడా కులాంతర వివాహాలు చేసుకునేలా ప్రోత్సహించిన ఆదర్శమూర్తి సుమతి. భర్త మధు పార్టీ పనుల్లో విరామం లేకుండా తిరుగుతుంటే ఉద్యోగం చేసుకుంటూనే కుటుంబాన్ని చూసుకునేది. అంతేకాదు... పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎవరు ఇంటికి వచ్చినా అందరికీ అన్నీ చేసి పెట్టేది. ఎంతో ప్రేమగా వారినీ తన కుటుంబ సభ్యులుగా ఆదరించేది. అలాగే సైన్స్ ఉద్యమం (జె.వి.వి)లో కూడా కీలక పాత్ర పోషించింది. కూతురు ప్రతిభకు పదేళ్లు వున్నప్పుడు ఆంధ్ర యూనివర్సిటీ నైట్ కాలేజీలో సివిల్ ఇంజనీరింగ్ (డిగ్రీ) సీటు వచ్చింది. కానీ పాప చదువుకోసం దాన్ని విరమించుకుంది.

### ఉద్యోగానికి విఆర్ఎస్ తీసుకొని...

కూతురు ప్రతిభ ఈరోజు డాక్టర్ అయ్యిందంటే అందులో సుమతి కృషి చాలా ఉంది. అంతేకాదు ఈ రోజు పి.మధు పార్టీలో ఓ నాయకుడిగా ఎదిగారంటే అందులో ఆమె పాత్ర చాలా కీలకం. తర్వాత ఉద్యోగానికి విఆర్ఎస్ తీసుకొని మహిళా ఉద్యమంలోకి వచ్చింది. అలాగే 'ప్రజాశక్తి'లో కొన్ని రోజులు అనువాదకురాలిగా చేసింది. బుక్‌హౌస్‌లో ఉంటూ అనేక పుస్తకాలను అనువదించింది. ఉమ్మడి రాష్ట్రంలో 'ఐద్వా' అభివృద్ధికి తన వంతు కృషి చేసింది. 2001లో 'ఐద్వా' అఖిల భారత 7వ మహాసభ విశాఖపట్నంలో జరిగింది. అప్పుడు ఓ సావనీర్ తీసుకొచ్చాం. ఆ సావనీర్ పనులన్నీ ఆమె దగ్గరుండి చూసుకుంది. వ్యాసాలు తెప్పించడం, తప్పులు లేకుండా చూడడం, ఫ్రీగా ప్రింటింగ్ వేయించడం ఇలా అన్ని పనులూ ఆమె చూసుకుంది.?'మానవి' పత్రిక ప్రారంభించడంలో సుమతి కీలక పాత్ర పోషించింది. పత్రిక బోర్డు సభ్యురాలిగా ఉంటూ 'మానవి'కి కావాల్సిన వ్యాసాలు తెప్పించడం, రాయడం, దాన్ని బయటకు తీసుకురావడంలో ఎంతో కృషి చేసింది. అలాగే 'మోటూరు ఉదయం ట్రస్ట్' ప్రారంభంలో కూడా ఆమె కీలక పాత్ర పోషించింది. ట్రస్ట్ సభ్యురాలిగా కూడా ఉంది. 'ఐద్వా' రాష్ట్ర కార్యదర్శివర్గంలో ఉండేది. అప్పట్లో మహబూబ్‌నగర్ జిల్లా ధన్వాడ ప్రాంతంలో జోగిని వ్యవస్థ బాగా ఉండేది. చాలా మంది మహిళలు బలైపోతూ ఉండేవారు. అప్పట్లో ఇద్దరు పిల్లల తల్లి ఆకలికి తట్టుకోలేక చనిపోయింది. అప్పుడు నేనూ, సుమతి కలిసి ధన్వాడ వెళ్లి పక్కన ఉన్న మరో రెండు గ్రామాల్లో తిరిగి జోగినీల సమస్యలు తెలుసుకున్నాం. సుమతి అయితే వాళ్లతో మాట్లాడుతూ కన్నీళ్లు పెట్టుకుంది. వారికి పునరావాసం కల్పించాలని, పిల్లలకు చదువులు చెప్పించాలని కొన్ని డిమాండ్లతో జిల్లా కలెక్టర్‌ని కలిసి వినతిపత్రం ఇచ్చాం.?

### పెన్షన్ మొత్తం విరాళంగా...

రాష్ట్రం విడిపోయిన తర్వాత వారి కుటుంబం ఆంధ్రప్రదేశ్‌కు మారింది. గత కొన్నేళ్లుగా మహబూబ్‌నగర్‌లో డాక్టర్‌గా పని చేస్తున్న తన కూతురు ప్రతిభ దగ్గరే ఆమె ఉంటోంది. కదలలేని స్థితిలో ఉన్నా తనకు వచ్చే పెన్షన్ మొత్తం రెండు రాష్ట్రాల పార్టీ కమిటీలకు విరాళంగా ఇచ్చేది. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 'ఐద్వా' అఖిల భారత మహాసభకు కూడా రూ.30 వేలు విరాళం ఇచ్చింది. ఇదంతా ప్రజా ఉద్యమాలపై ఆమెకున్న ప్రేమకు నిదర్శనం. పార్టీ అన్నా, పార్టీలో పని చేసే పూర్తి కాలం కార్యకర్తలన్నా ఆమెకు ఎంతో ప్రేమ.?


### రాజకీయ చైతన్యంతో ఉద్యమాలకు తోడ్పాటు...

నాకైతే వ్యక్తిగతంగా ఎన్నో సలహాలు ఇచ్చేది. పెళ్లి కాక ముందు నుండి నాకు సుమతక్కతో మంచి పరిచయం. మా సృజన పుట్టిన కొత్తలో ఉద్యమాన్ని, పాపని సమన్వయం చేసుకోలేక సతమతమవుతుంటే ఎలా నిర్వహించుకోవాలో సలహాలు ఇచ్చేది. అభ్యుదయ ఉద్యమాలు జరగడం ఓ భాగమైతే వాటి ప్రభావం మనుషులపై చాలా ఉంటుంది. అలా ప్రభావితమైన వ్యక్తి సుమతి. ఆ ప్రభావంతోనే రిటైర్ అయిన తర్వాత కూడా పార్టీకి తన వంతుగా సహకారం అందించింది. అప్పట్లో చిర్రావూరిగారినైతే నాన్న అంటూ ఆప్యాయంగా పిలిచేది. నండూరి ప్రసాదరావు అండర్‌గ్రౌండ్‌లో ఉన్నప్పుడు సుమతి దగ్గరే ఉండేవారు. ఎం.హెచ్ తో కూడా ఈమెకు మంచి అనుబంధం ఉండేది. నాయకులందరినీ తన కుటుంబ సభ్యులుగా చూసుకునేది. కుటుంబాల్లో ఉండే మహిళల తోడ్పాటు లేకుండా అభ్యుదయ ఉద్యమాలు కొనసాగించడం సాధ్యం కాదు. అలాంటి పాత్ర పోషించిన వారిలో సుమతి ఒకరు. చివరి రోజుల్లో తన తల్లిని ప్రతిభ కంటికి రెప్పలా చూసుకుంది.

**ఎస్. పుణ్యవతి**

# వందేమాతరం ఎందుకు వివాదం

'వందేమాతరం' -- అనే మన జాతీయ గేయాన్ని బంకించంద్ర ఛటర్జీ రాసి, 150 ఏళ్ళయిన సందర్భంగా 2025 డిసెంబర్ 8న లోకసభలో ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడుతూ "వందేమాతరం గేయాన్ని నెహ్రూ ముక్కలు చేశారు. దాని ఫలితంగానే ఈ దేశం ముక్కలైంది" అని ప్రకటించారు. వందేమాతర గేయం గూర్చి పూర్తి నిజాలు దేశ ప్రజలకు తెలియజేయకుండా, నెహ్రూ మీద అభాండాలు వేశారు. అలా మాట్లాడటం జాతిపిత గాంధీజీని, నాటి రాష్ట్రపతి డా.రాజేంద్రప్రసాద్‌ను, మౌలానా ఆజాద్ ను, సుభాష్ చంద్రబోస్ ను, ఆచార్య దేవ్ ను, విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్‌ను మోడీ అవమానించినట్లయింది. ఎందుకంటే, మన జాతీయ గీతం 'జన గణ మన'తో పాటు వందేమాతరాన్ని కూడా జాతీయ గేయంగా గుర్తించిన ప్రముఖులు వీరంతా. వందేమాతరాన్ని గుర్తించినపుడు అది రెండు చరణాలదే! అందులో సుజలాం, సుఫలాం, మలయజ శీతలాం - అంటూ దేశ ఔన్నత్యాన్ని తెలియజేప్పే చరణాలున్నాయి. బంకించంద్ర ఛటర్జీ ఆ రెండు చరణాల గేయం 1875లో రాశాడు. అది 1876లో ప్రచురింపబడింది. భారత ప్రభుత్వం ఆ రెండు చరణాలనే ఆనాడు అధికారికంగా గుర్తించింది. స్వాతంత్రోద్యమ కాలంలో ఉద్యమకారులు ఆ రెండు చరణాలనే పాడుతుండేవారు. ఆ తరువాత కొన్ని పరిణామాలు చోటుచేసుకున్నాయి. బంకించంద్ర, ఆ రెండు చరణాలకు తోడుగా మరో మూడు చరణాలు రాసి, 1882లో తన 'ఆనంద్ మఠ్' నవలలో చేర్చుకున్నాడు. అయితే తర్వాత, నవల కోసం రాసుకున్న చరణాలు ఈ దేశానికి సంబంధించినవి కావు. అవి దేవి/ దుర్గ / కాళీమాత / లక్ష్మి/ సరస్వతి వంటి హిందూ దేవతల ప్రశంసలతో ఉన్నవి. నవలలోని చరణాలు మన జాతీయ గేయంలో భాగం కాదు. వాస్తవం ఇదయితే, పనిగట్టుకుని




నెహ్రూను దూషించడానికి దీన్ని ఉపయోగించారు. ఈ గేయం ముక్కలు అయినందువల్లే, హిందుస్తాన్-పాకిస్తాన్‌గా దేశం ముక్కలైందనడంలో ఔచిత్యం ఉందా మన టెలిప్రాంప్టర్ ప్రచార (ప్రధాన) మంత్రి తన ఆక్రోశం వెళ్ళగక్కడంలో అర్థం ఉందా అని ఈ దేశ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దేశ ఔన్నత్యం గూర్చి రాసిన రెండు చరణాల వందేమాతర గేయానికి 2025 నాటికి 150 ఏళ్ళయ్యింది. బంకించంద్ర ఛటర్జీ ఆ తర్వాత 1882లో రాసిన 3 చరణాలకు 150 ఏళ్ళు రావాలంటే మనం 2032 దాకా వేచి ఉండాలి కదా ప్రధాని పదవిలో ఉండి అలవోకగా అబద్ధాలాడడం హర్షించదగ్గ విషయమా దేశ ప్రజలు ఆలోచిస్తున్నారు. మోడీ ఒక అబద్ధానికి తెర లేపగానే, లోక్‌సభలో ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరం వెలిబుచ్చారు. విశ్వకవి రవీంద్రుణ్ణి, ఆనాటి మహనీయుల్ని అవమానించినట్లయిందని నినాదాలిచ్చారు. అంత జరిగినా, బిజెపి ప్రభుత్వం పార్లమెంట్‌లో వందేమాతరం బిల్లు ఇటీవల పాస్ చేసుకుంది. అయినా, దేశ ప్రజల్లో ఫెయిల్ అయిన విషయం, అక్కడ పాస్ చేసుకుంటే లాభమేమిటి గతంలోకి వెళ్ళి కొన్ని వాస్తవాలు వెలికి తీస్తే, అవి ఇలా ఉన్నాయి. 'వందేమాతం' గురించి చర్చ వచ్చినప్పుడు- అది సాహిత్య విషయం గనక, నాటి ప్రధాని నెహ్రూ విశ్వకవి, నోబెల్ గ్రహీత అయిన రవీంద్రుడి అభిప్రాయం కోరారు. ఆయన కూడా ఆ రెండు మొదటి చరణాలనే ఆమోదించారు. 1937 అక్టోబర్ లో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ జాతీయ సమావేశంలో తొలిసారి ఆ రెండు చరణాల్ని ఆలాపించారు. ఆ తర్వాత, ఆ రెండు చరణాలనే స్వాతంత్ర్య పోరాట యోధులు గొంతెత్తి పాడుకునేవారు. మొదట రాసిన ఆ రెండు చరణాల్ని ఆమోదించడమే కాకుండా రవీంద్రుడు దానికి బాణిని కూడా సమకూర్చాడు. సుజలాం సుఫలాం మలయజ శీతలాం సస్య శ్యామలాం మాతరం - వందే మాతరంశుభ్ర జ్యోత్స్న పులకిత యామినిపుల్లకు సుమిత ద్రుమదళ శోభినిసుహాసినీం, సుమధుర భాషిణీంసుఖదాం వరదాం-మాతరం వందేమాతరం (1875)తర్వాత రాసి, నవలలో చేర్చిన చరణాలు ఇలా ఉన్నాయి. సప్త కోటి కంఠ కలకల నినాదే- అన్న చరణంలో బెంగాల్ జనాభా ఏడు కోట్ల గురించి, వారికి ఆరాధ్య దైవమైన దుర్గామాత గురించి ఉంది. మరి మన దేశ జనాభా ఇప్పుడు - 1.48 బిలియన్లు! పైగా సెక్యులర్ దేశం !!త్వం హి దుర్గా దశ ప్రహరణ ధారిణీమ కమలా కమలదళ్ విహారిణీ వాణీ విద్యా దాయినీ నమామిత్వం నమామి కమలా అమలా అతులామ్ (1882)ఇందులో బిజెపి పార్టీ గుర్తు కమలం ఉన్నందువల్ల, వారు దాన్ని దేశ ప్రజలందరి మీద రుద్దే ప్రయత్నం చేస్తున్నారేమో'ఆనంద్ మఠ్' నవల నుండి తీసుకున్న చరణాల గూర్చి ఆ రోజుల్లోనే తర్జన భర్జన జరిగింది. 1939 జులై 1న గాంధీజీ తన 'హరిజన్' పత్రికలో ఇలా రాశారు. బెంగాల్‌లోని హిందూ ముస్లింల మధ్య ఈ గేయం విద్వేషాలు రేకెత్తిస్తున్నట్లయితే - అందరూ కలిసి ఉన్న సమూహాల్లో దీన్ని పాడడం కొందరికి అభ్యంతరకరంగా ఉంటే - తక్షణం దాన్ని పాడడం ఆపేయాలి!" అని! మరోవైపు 1938 అక్టోబర్ లో కరాచీలో జరిగిన ముస్లింలీగ్ కాన్ఫరెన్స్ లో మహ్మదాలీ జిన్నా- వందేమాతరం పట్ల తన తీవ్రమైన అభ్యంతరం తెలియజేశాడు. హిందూ దేవతల ప్రార్థనగా ఉన్న ఈ గేయం ముస్లింల పట్ల ద్వేష భావాన్ని పెంచుతోంది. ముస్లింలు విగ్రహారాధనను ఇష్టపడరు. అలాంటప్పుడు ఈ ప్రార్థనా గీతాన్ని ఎలా ఒప్పుకుంటారు -అన్నాడు. ఇలా భిన్నమైన అభిప్రాయాలు ఇప్పుడు కాదు, ఆ రోజుల్లోనే వెలువడ్డాయి. ఇది చారిత్రక సత్యం! అయితే, స్వాతంత్ర్యం లభించిన తర్వాత ఏర్పడ్డ తొలి భారత ప్రభుత్వం 1950 జనవరి 24న దేశ ఔన్నత్యాన్ని చాటి చెప్పే ఆ మొదటి రెండు చరణాల్ని అధికారికంగా జాతీయగేయంగా గుర్తించిం ది. జాతీయ గీతంగా ఉన్న జనగణ మన 'అధినాయక జయహే' తో పాటు వందేమాతరానిక్కూడా ఆ స్థాయీ, గౌరవం ఇచ్చారు. అప్పుడు భారత రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ !ఇందులో వందేమాతరం గేయాన్ని నెహ్రూ విరగ్గొట్టిందెక్కడ దేశాన్ని విభజించిందెక్కడ దేశం విడిపోవడానికి మహ్మద్ ఆలీ జిన్నా ఎంత కారణమో హిందూ మహాసభ కూడా అంతే కారణం. దేశం బ్రిటీషు వారి పాలనలో ఉండాలని కలలుగన్న వారు ఈ హిందూ మహాసభా/ ఆర్ఎస్ఎస్ వారే కదా వారి వారసులే జనసంఘ్ / బిజెపి నాయకులయ్యారు కదా ఈ విషయాలు ఈ దేశంలో ఏ స్కూలు పిల్లాడిని అడిగినా చెప్తారు. స్వాతంత్ర్య పోరాటంలో ఏ మాత్రం పాలు పంచుకోని వీరు, ఇప్పుడు దేశా ప్రజలకు దేశభక్తి గురించి ఉపన్యాసాలిస్తున్నారు. జాతీయ గీతంగా ఉన్న 'జనగణమన' ను తొలగించి, దాని స్థానంలో వందేమాతరాన్ని పెట్టాలని కొంతమంది ఆ మధ్య ఢిల్లీ కోర్టులో 'పిల్సు' (ప్రజా ప్రయోజన వ్యాజ్యం) వేశారు. ఈ సెక్యులర్ దేశానికి దుర్గామాత స్తోత్రం అవసరం లేదని కోర్టు వాటినన్నింటినీ కొట్టేసింది.

**ప్రొ. దేవరాజు మహారాజు**

# క్రీడలు, ఫిట్‌నెస్‌తో యువతే దేశ భవిష్యత్

## జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా 'ఖేలో ఇండియా డైలాగ్' ప్రత్యక్ష కార్యక్రమాలు










మేడ్చల్ మల్కాజ్గిరి ఆగస్టు 28 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: జాతీయ క్రీడా దినోత్సవం--2026 సందర్భంగా కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మై భారత్ కార్యక్రమంలో భాగంగా మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలోని రెండు విద్యాసంస్థల్లో 'ఖేలో ఇండియా డైలాగ్--ఖేల్ కీ బాత్ పీఎం కే సాథ్' ప్రత్యక్ష కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులు, యువత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో జరిగిన ప్రత్యక్ష వర్చువల్ కార్యక్రమంలో పాల్గొన్నారు.భారత క్రీడా వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, క్షేత్రస్థాయిలో క్రీడలను ప్రోత్సహించడం, క్రీడా ప్రతిభను గుర్తించడం, ఫిట్‌నెస్‌తో పాటు క్రమశిక్షణను పెంపొందించడం, దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యాన్ని విస్తరించడం వంటి అంశాలను ప్రధానమంత్రి తన సందేశంలో ప్రధానంగా ప్రస్తావించారు.**కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..**ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కూకట్‌పల్లిలో అంతర్జాతీయ సైక్లింగ్ క్రీడాకారుడు జి. సాయి చరణ్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులతో ముచ్చటి ంచారు. క్రీడల్లో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే క్రమశిక్షణ, నిరంతర సాధన, పట్టుదల ఎంతో అవసరమని పేర్కొంటూ యువతను ప్రోత్సహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎన్. చందన, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డా. నాగుల వేణు, డా. డి. పద్మ, డా. ఎ. గోపాల్ పాల్గొన్నారు.

**వేడ్చల్ మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో..**

మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల, మేడ్చల్‌లో జాతీయ స్థాయి సైక్లిస్ట్ అల్లాడి సాయి శ్రేయస్, కోచ్ అల్లాడి కృష్ణతో పాటు స్విమ్మర్లు విష్ణు వర్ధన్, వర్షిత్ ధులిపూడి, అభయ్ లక్కోజు, సచిన్ సాత్విక్, కశిష్ శ్రీవాస్తవ పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. రాధ, పి.వి. నాగలక్ష్మి (ఏటీపీ), ప్రతిభ (డీడబ్ల్యూ), ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఇ. నాగలక్ష్మి పాల్గొన్నారు.మై భారత్ తరఫున కిరణ్‌కుమార్ కందుకూరి, ఎ. హర్షిత రెడ్డి, ఇ. వికాస్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

**వికసిత్ భారత్ సాధనలో యువత భాగస్వామ్యం**

క్రీడలు, ఫిట్‌నెస్, క్రమశిక్షణతో పాటు మాదకద్రవ్యాలకు దూరంగా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా యువతను శక్తివంతం చేసి 'వికసిత్ భారత్ ఏ2047' లక్ష్య సాధనలో భాగస్వాములను చేయాలనే ప్రధానమంత్రి దృష్టికోణాన్ని ఈ కార్యక్రమం ప్రతిబింబించింది.యువత మై భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకుని స్వచ్ఛంద సేవ, నాయకత్వం, అనుభవాధారిత అభ్యాసం, దేశ నిర్మాణానికి సంబంధించిన వివిధ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. అలాగే 'వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్--2027'లో చురుకుగా పాల్గొని తమ ఆలోచనలు, ప్రతిభ, శక్తిని దేశ అభివృద్ధికి వినియోగించాలని పిలుపుని చ్చారు.మై భారత్, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ శ్రీమతి స్నేహల్ ద్న్యానేశ్వర్ బసుట్కర్ మాట్లాడుతూ యువత క్రీడలు, ఫిట్‌నెస్‌ను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. మై భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకుని వివిధ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం ద్వారా వికసిత్ భారత్ నిర్మాణంలో తమ ఆలోచనలు, శక్తితో అర్థవంతమైన సహకారం అందించాలని ఆమె కోరారు.

# ట్రైబల్ మ్యూజియం అద్భుతంగా ఉంది

## హరిలాల్ సింగ్ రిటైర్డ్ ఎస్ ఎస్సీ ఎల్ సూపర్వైజర్ చత్తీస్గడ్ రాష్ట్రం ఏలూరు జిల్లా పెల్లి బృందం







భద్రాచలం ఆగస్టు 28 నిర్భయ వార్త ప్రతినిధి  ఐటీడీఏ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మ్యూజియం పాత తరం గిరిజనుల సంస్కృతి సాంప్రదాయాలు ఆచార వ్యవహారాలు మరియు వస్తువులు చూపరులకు కనువిందు కలిగేలా ఉన్నాయని చత్తీస్గడ్ రాష్ట్రం ఎస్ ఎస్సీ ఎల్ సర్వే డిపార్ట్మెంట్ రిటైర్డ్ సూపర్వైజర్ హరిలాల్ సింగ్ మరియు ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం నకు చెందిన పెల్లి బృందం సభ్యులు తెలిపారు.  శుక్రవారం  ఐటిడిఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియంను వారు సందర్శించి మ్యూజియంలోని ప్రతి కళాఖండాలను తిలకించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి సన్నిధిలో వివాహం జరిపించి స్వామి వారి దర్శనం చేసుకోగానే గిరిజనుల సంస్కృతికి సంబంధించిన మ్యూజియం ఉందని తెలిసి ట్రైబల్ మ్యూజియం సందర్శనకు రావడం జరిగిందని అన్నారు. మ్యూజియం సందర్శించడానికి వచ్చే యాత్రికులకు మ్యూజియం ఎంట్రెన్స్ లోనే వివిధ కళాఖండాలతో రూపొందించిన అలంకరణాలు ప్రతిబింబించేలా ఉన్నాయని, మ్యూజియం ఆవరణలో నిర్మించిన పాతకాలపు ఇండ్లు గిరిజన తెగల వారిగా వారి సంస్కృతికి తగ్గట్టు డిజైన్ చాలా బాగుందని అన్నారు. చిన్నారులకు ఆటవిడుపుగా క్రీడాస్థలం, యువకుల కోసం బాక్స్ క్రికెట్ ఏర్పాటు చేయడం చాలా బాగుందని అన్నారు. మ్యూజియమును పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చి సందర్శించే విధంగా ఇంకా కొత్త రకం డిజైన్లు రూపొందించాలని, సందర్శనకు వచ్చే పర్యాటకుల ద్వారా ఫీడ్బ్యాక్ తీసుకొని వారికి తగ్గట్టు అభివృద్ధిని బట్టి మ్యూజియంలో కళాఖండాలు పొందుపరచాలని అన్నారు. మ్యూజియం ఏర్పాటు చేసిన విధానం చక్కటి నిర్వహణ సిబ్బంది అందించిన సమాచారం ఉద్యమంలోని కళాఖండాలు మాకు చాలా ఆకట్టుకున్నాయని, ట్రైబల్  కల్చర్కు సంబంధించిన మ్యూజియం ఏర్పాటు చేసిన ఐటీడీఏ అధికారులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మ్యూజియం ఇంచార్జ్ ప్రభాకర్ రావు,మాధవి, సలీం తదితరులు పాల్గొన్నారు.

# టీవీ9 రిపోర్టర్ అనిల్ రెడ్డి సతీమణి సరళ కి ఎమ్మెల్యే నివాళులు



భద్రాచలం నిర్భయ వార్త ప్రతినిధి.భద్రాచలం--చర్ల రోడ్డులో టీవీ9 రిపోర్టర్ శ్రీ అనిల్ రెడ్డి సతీమణి శ్రీమతి సరళ మృతి చెందగా, వారి పార్థివదేహానికి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ , 12వ వార్డు సభ్యులు కారం దుర్గారావు, 13వ వార్డు సభ్యులు తాటి ఉదయ్, పార్టీ నాయకులు రత్నం రమాకాంత్, నర్రా రాము, భీమవరపు వెంకటరెడ్డి, మహ్మద్ జిందా, కేతినేని లలిత, యూత్ నాయకులు గాడి విజయ్, మాచినేని భాను, వేముల అనిల్, కుందవరపు శ్యామ్ తదితరులు కార్యక్రమానికి హాజరై కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# భద్రాచలం పట్టణంలో ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు సుమారు 30 కిలోల ఆహార పదార్థాలు డిస్కార్డ్





భద్రాచలం ఆగస్టు 28 నిర్భయ వార్త ప్రతినిధి.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ఈ . శరత్ ఆధ్వర్యంలో ఈరోజు భద్రాచలం పట్టణంలోని మార్కెట్ ప్రాంతంలో పలు కిరాణా దుకాణాలు, జనరల్ స్టోర్స్ మరియు ఆహార పదార్థాల విక్రయ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో సుమారు 15 దుకాణాలను తనిఖీ చేసి, మిఠాయిలు, క్యాండీలు, ప్యాకేజ్డ్ ఫుడ్ తదితర ఆహార పదార్థాల నాణ్యత, ప్యాకింగ్, లేబులింగ్, గడువు తేదీలు నిల్వ విధానాలను పరిశీలించారు. తనిఖీల సందర్భంగా నాణ్యతకు సంబంధించి అనుమానం ఉన్న ఆహార పదార్థాల నమూనాలను సేకరించి (సాంపిల్స్ లిఫటెడ్ ) ప్రయోగశాల పరీక్షల కోసం పంపించారు. అలాగే, నిబంధనలకు అనుగుణంగా లేని మరియు వినియోగానికి అనర్హంగా ఉన్న సుమారు 30 కిలోల ఆహార పదార్థాలను గుర్తించి డిస్కార్డ్ చేయించారు.అన్ని ఆహార వ్యాపారులు తప్పనిసరిగా ఫస్సై ఫుడ్ లైసెన్స్ /రిజిస్ట్రేషన్ తీసుకోవాలని అధికారులు సూచించారు. ఆహార పదార్థాలను పరిశుభ్రమైన వాతావరణంలో నిల్వ చేయడంతో పాటు, ఖీూూ× నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలను పాటించాలని తెలిపారు.ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందేలా జిల్లాలో ఫుడ్ సేఫ్టీ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ఈ . శరత్ తెలిపారు.

# రాజీవ్ గృహకల్పలో ఘనంగా రాఖీ పండుగ

### సోదరుడు తూడిమెళ్ల మల్లికార్జున్‌కు రాఖీలు కట్టిన మహిళలు





యాప్రాల్ ఆగస్టు 28 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: మల్కాజిగిరి నియోజకవర్గం యాప్రాల్ డివిజన్ కౌకూర్‌లోని రాజీవ్ గృహకల్ప కాలనీలో రాఖీ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాలనీకి చెందిన అక్కచెల్లెళ్లు, తల్లులు పెద్ద సంఖ్యలో పాల్గొని తూడిమెళ్ల మల్లికార్జున్‌కు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ రాఖీ కేవలం ఒక దారం కాదని, అది జన్మబంధానికి ప్రతీక అని అన్నారు. రాజీవ్ గృహకల్ప కాలనీతో తనకు ఎన్నో ఏళ్లుగా అనుబంధం ఉందని, కాలనీలోని ప్రతి ఒక్కరినీ తన కుటుంబ సభ్యులుగా భావిస్తానని తెలిపారు. కష్టసుఖాల్లో తనకు అండగా నిలిచిన వారి ప్రేమ, నమ్మకాన్ని ఎప్పటికీ మరువబోనన్నారు. కాలనీ ప్రజల రక్షణతో పాటు అభివృద్ధి బాధ్యతను తన వంతుగా నిర్వర్తిస్తానని, సోదరుడిగా, కుటుంబ సభ్యుడిగా ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అక్కచెల్లెళ్లు మాట్లాడుతూ మల్లికార్జున్ తమకు కేవలం నాయకుడు మాత్రమే కాదని, కుటుంబ సభ్యుడిలా అండగా నిలుస్తారని తెలిపారు. ఎప్పుడు ఏ అవసరం వచ్చినా అన్నలా ఆదుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బాలసదనం చిన్నారులతో కలెక్టర్ రక్షాబంధన్ వేడుకలు

### కలెక్టర్‌కు రాఖీలు కట్టిన చిన్నారులు.. ఆప్యాయంగా పలకరించిన మనుచౌదరి





మేడ్చల్ మల్కాజిగిరి,కలెక్టరేట్ ఆగస్టు 28 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ ప్రాంగణంలో ప్రభుత్వ బాలసదనం బాలబాలికలు జిల్లా కలెక్టర్ మనుచౌదరికి రాఖీలు కట్టి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పిల్లలతో ఆప్యాయంగా ముచ్చటించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. బాలసదనం చిన్నారుల కోసం కలెక్టర్ ప్రత్యేకంగా భోజనం ఏర్పాటు చేయడంతో పాటు స్వీట్లు, కొత్త దుస్తులను అందజేశారు. పిల్లలతో కలిసి భోజనం చేసిన ఆయన వారి అవసరాలు, ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. పిల్లలతో కొంతసేపు ఆప్యాయంగా గడిపి వారికి భరోసా కల్పించారు. పిల్లల చదువు, ఆరోగ్యం, సంక్షేమానికి అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించేందుకు జిల్లా యంత్రాంగం అండగా ఉంటుందని కలెక్టర్ మనుచౌదరి తెలిపారు.

విద్యాభ్యాసంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి శారద, బాలరక్ష భవన్ కోఆర్డినేటర్ తిరుమలాదేవి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి ఇంతియాజ్ రహీం తదితర అధికారులు పాల్గొన్నారు. రక్షాబంధన్ సందర్భంగా కలెక్టర్‌కు బాలసదనం చిన్నారులు రాఖీలు కట్టడం, కలెక్టర్ వారితో కలిసి భోజనం చేసి స్వీట్లు, కొత్త దుస్తులు అందించడం పిల్లల్లో ఆనందాన్ని నింపింది. అధికారుల ఆప్యాయత, భరోసాతో బాలసదనం చిన్నారులు ఉత్సాహంగా రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన్నారు.

# కారేపల్లిలో జోరుగా సిండికేట్

**ఆటోలో బెల్ట్ షాపులకు తరలింపు.**
**ఎమ్మార్పీ కంటే అధిక రేట్లకు విక్రయాలు.**
**సిండికేట్ అరికట్టడంలో ఎక్సైజ్ శాఖ విఫలం**




కారేపల్లి ఆగస్టు 28 నిర్భయవార్త రిపోర్టర్. సింగరేణి మండల కేంద్రంలో వైన్ షాపులు సిండికేట్ గా ఏర్పడి మండల పరిధిలోని పలు గ్రామపంచాయతీలో ఉదయం 6 గంటలకు, సాయంత్రం వేళల్లో కూడా బెల్ట్ షాపులకు ఎమ్మార్పీ ధరలకంటే అధికంగా ఒక్కొక్క కోటర్ బాటిల్ 20 రూపాయల నుండి 30? రూపాయల వరకు అదనంగా విక్రయిస్తున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. మద్యం పచ్చని పల్లెల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులకు ఏరులై పారుతుంది. ఓ వైన్ షాప్ నుండి నిత్యం ఆటోలలో మద్యం బాక్సులను గ్రామాలకు తరలిస్తూ అధిక రేట్లకు విక్రయిస్తున్నారు. ఎక్సైజ్ శాఖ విధుల్లో నిర్లక్ష్యంగా ఉండడంతో ఈ వ్యవహారం అంతా మూడు పూలు ఆరుకాయలుగా జోరుగా వ్యాపారం సాగుతుంది. ప్రభుత్వం నిబంధనలకు ఆటోలో మద్యం తరలించకూడదని నిబంధనలు ఉన్నప్పటికీ జోరుగా సాగుతున్న ఎక్సైజ్ శాఖ పట్టించుకోవడం లేదు. సిండికేట్ వ్యవస్థకు ఎక్సైజ్ శాఖ ప్రోత్సాహమా? విధుల్లో నిర్లక్ష్యమా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజా ఆరోగ్యాలు దృష్టిలో ఉంచుకొని మద్యం సరఫరాపై, బెల్ట్ షాపుకు ఎంఆర్పి కంటే అధికంగా విక్రయించడం వల్ల సంబంధిత శాఖ కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం ప్రారంభం

**మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులు**



హైదరాబాద్ ఆగస్టు 28 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: తెలంగాణ ప్రభుత్వం, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆదేశాల మేరకు హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవం--2026 వేడుకలు మూడు రోజుల పాటు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఆగస్టు 28 నుంచి 30వ తేదీ వరకు వివిధ క్రీడా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. వేడుకల్లో భాగంగా తొలిరోజైన శుక్రవారం జిల్లా యువజన, క్రీడల శాఖ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన దేశ క్రీడా రంగానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి వై. దామోదర్ రెడ్డి, ఖేలో ఇండియా సైక్లింగ్ కోచ్‌తో పాటు క్రీడా శాఖ సిబ్బంది పాల్గొన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల్లో యువత, క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని అధికారులు ఆకాంక్షించారు.

# దళితుల బైండ్‌ఓవర్‌పై దళిత సంఘాల ఆగ్రహం

**నోటీసు లేకుండా బైండ్‌ఓవర్ చేశారంటూ ఆరోపణలు**
**తహసీల్దార్ తీరుపై దళిత యువజన నాయకుడు అభిషేక్ అభ్యంతరం**
**ఉత్తర్వులు రద్దు చేయకుంటే ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయిస్తామని హెచ్చరిక**
**బైండ్‌ఓవర్ ప్రక్రియపై సమగ్ర విచారణకు డిమాండ్**
**కలెక్టర్, ఆర్డీవో జోక్యంతో న్యాయం చేయాలని వినతి**

**కుత్బుల్లాపూర్,** నిర్భయవార్త ప్రతినిధి : దళితులను నోటీసు ఇవ్వకుండా బైండ్‌ఓవర్ చేశారన్న ఆరోపణలపై దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అల్వాల్ తహసీల్దార్ రాములు చట్టపరమైన ప్రక్రియను పాటించకుండా ఏడాది కాలానికి బైండ్‌ఓవర్ చేసినట్లు బాధితులు ఆరోపిస్తూ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్, మల్కాజిగిరి ఆర్డీవోకు ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది.

**హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో వివాదం**

అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో 791/2026 నంబరుతో కేసు నమోదైందని బాధితులు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి తెలంగాణ హైకోర్టులో క్రిమినల్ పిటిషన్ 13382/2026 దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. ఆగస్టు 31లోగా దర్యాప్తు అధికారిని కలవాలని, హాజరైన అనంతరం భారతీయ నాగరిక్ సురక్షా సంహితలోని 35(3) సెక్షన్ కింద నోటీసు జారీ చేసి సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటించాలని కోర్టు ఆదేశించినట్లు తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు దర్యాప్తు అధికారిని కలిసి 35(3) సెక్షన్ కింద నోటీసు అందుకున్నప్పటికీ, ఆగస్టు 24న తహసీల్దార్ ఎదుట బైండ్‌ఓవర్ కోసం హాజరు కావాలని చెప్పారని బాధితులు ఆరోపించారు. ముందస్తు నోటీసు, తగిన విచారణ లేకుండా బైండ్‌ఓవర్ చేయడం చట్టపరమైన విధానానికి, సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని ఫిర్యాదులో పేర్కొన్నారు.

**దళిత యువజన నాయకుడి అభ్యంతరం**

ఈ వ్యవహారంపై దళిత యువజన నాయకుడు అభిషేక్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దళితులను అక్రమంగా బైండ్‌ఓవర్ చేయడం సరికాదని, బైండ్‌ఓవర్ ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంబంధిత ఉత్తర్వులను రద్దు చేయని పక్షంలో తహసీల్దార్ రాములుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించాల్సి వస్తుందని హెచ్చరించారు.


**ఆర్టీఐతో వివరాల సేకరణ**

ఆగస్టు 24న బైండ్‌ఓవర్ చేసిన అనంతరం దానికి సంబంధించిన ఉత్తర్వులు, విచారణ ప్రక్రియ, ఇతర రికార్డుల ప్రతులను ఇవ్వాలని కోరుతూ ఆగస్టు 25న అల్వాల్ తహసీల్దార్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసినట్లు బాధితులు తెలిపారు. వ్యక్తిగత స్వేచ్ఛ, జీవించే హక్కుకు సంబంధించిన అంశంగా పేర్కొంటూ 48 గంటల్లో సమాచారం ఇవ్వాలని కోరినప్పటికీ సమాచారం అందలేదని తెలిపారు. దీంతో ఆగస్టు 27న మల్కాజిగిరి ఆర్డీవోకు మొదటి అప్పీల్ దాఖలు చేసినట్లు వెల్లడించారు.

**విచారణ జరిపి న్యాయం చేయాలి**

బైండ్‌ఓవర్ ప్రక్రియలో నిబంధనలు పాటించారా? సంబంధిత వ్యక్తులకు ముందస్తు నోటీసులు ఇచ్చారా తవిచారణ నిర్వహించారా అనే అంశాలపై ఉన్నతాధికారులు సమగ్రంగా విచారణ జరపాలని దళిత సంఘాలు కోరుతున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా ఉత్తర్వులు జారీ చేసినట్లు తేలితే వాటిని వెంటనే రద్దు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, ఆర్డీవో తక్షణమే జోక్యం చేసుకుని బాధితులకు న్యాయం చేయాలని దళిత సంఘాల ప్రతినిధులు కోరారు.




# కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా భద్రు నాయక్



సింగరేణి ఆగస్టు 28 నిర్భయవార్త రిపోర్టర్. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీలో సింగరేణి మండల సీనియర్ నాయకులు, పొలంపల్లి మాజీ సర్పంచ్ దారావత్ భద్రు నాయక్ స్థానం లభించింది. జిల్లా కాంగ్రెస్ కార్యదర్శిగా భద్రు నాయక్‌ను పార్టీ అది నాయకత్వం నియమించింది. నమ్ముకున్న పార్టీను విడకుండా కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా నిలుస్తూ ప్రజా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ పార్టీని బలోపేతం చేస్తున్నారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న భద్రు నాయక్ సముచిత స్థానం ఇచ్చిందని మండల సీనియర్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. డీసీసీ కార్యదర్శిగా నియమితులైన దారావత్ భద్రు నాయక్ను భాగ్యనగర్ తండా సర్పంచ్ బానోత్ హీరాలాల్, జిల్లా నాయకులు భీముడు నాయక్, మండల నాయకులు భగవాన్ దాస్, రాందాస్ నాయక్ తారాచంద్, బాబు, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు హర్ష నాయక్, మండల పార్టీ కో ఆర్డినేటర్ గాంధీ, ఉప సర్పంచ్ భిక్కులాల్, ఈర్య నాయక్, మోతిలాల్, మహేష్, సుమ, పద్మ, భూలి, జ్యోతిలు అభినందించారు.

# పెండింగ్ నిధులను వెంటనే విడదల చేయాలనీ రాధిక గుప్తా కు మల్లాపూర్ నాయకుల వినతి




**ఉప్పల్ జోనల్** నిర్భయవార్త ప్రతినిధి :మేడ్చల్ జిల్లా ఉప్పల్ జోనల్ ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుమూల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా నీ కలిసి మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గతంలో పెండింగ్లో ఉన్న నిధులను వెంటనే మంజూరు చేయాలని వినతి పత్రాన్ని అందచేశారు. ఈ కార్యక్రమం లో డీసీసీ కార్యదర్శి లు. పర్వతాలు .కోయగూర బాలరాజ్ ఉమ్మడి మల్లాపూర్ డివిజన్ మాజీ అధ్యక్షులు కప్పర సాయి కిరణ్ గౌడ్ సీనియర్ నాయకులు మెరుపుల బాలరాజ్ పాల్గొన్నారు.

# ఆరేళ్ల వారి ఇంట కన్నుల పండుగగా రాఖీ వేడుక

## సోదర సోదరీమణుల అనుబంధానికి ప్రతీక రాఖీపౌర్ణమి






**మెదక్ టౌన్ :-** నిర్భయవార్త ప్రతినిధి : రాఖీపౌర్ణమి వేడుకలు మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్‌గౌడ్ నివాసంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. రక్షాబంధన్ సందర్భంగా ఆయన సోదరీమణులు రాణి, వాణి నివాసానికి చేరుకుని మల్లికార్జున్‌గౌడ్‌తో పాటు సోదరులు జనార్ధన్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్‌లకు రాఖీలు కట్టి శు భాకాంక్షలు తెలిపారు. అనంతరం మల్లికార్జున్‌గౌడ్ కుమార్తె సుధీక్షిత తన సోదరులు అభిరామ్‌గౌడ్, అశ్విత్‌గౌడ్, సాయిచైతన్యలకు రాఖీలు కట్టారు. దీంతో కుటుంబంలో రాఖీ పండుగ సందడి నెలకొంది. ఈ సందర్భంగా మల్లికార్జున్‌గౌడ్ మాట్లాడుతూ.. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలకు రాఖీపౌర్ణమి ప్రతీకగా నిలుస్తుందన్నారు. రాఖీ పండుగ అందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు నింపాలని ఆకాంక్షించారు. సోదర సోదరీమణుల మధ్య అనుబంధం మరింత బలపడాలని కోరుకున్నారు.

# వైభవంగా యజ్ఞోపవీత కార్యక్రమం..



**నారాయణఖేడ్** నిర్భయవార్త ప్రతినిధి :నారాయణఖేడ్ పట్టణ శివారులోని భక్త మార్కండేయ ఆలయంలో నూలు పౌర్ణమి సందర్భంగా యజ్ఞోపవీత కార్యక్రమాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే పద్మశాలి కుల బాంధవులు,భక్తులు భక్త మార్కండేయ, చంద్రమౌళీశ్వర స్వామికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేసి అనంతరం యజ్ఞోపవీత ధారణ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు,ఆలయ కమిటీ బాధ్యులు పౌర్ణమి విశిష్టతను భక్తులకు తెలియజేశారు. అనంతరం నాకు నీవు అండ నీకు నేను అండ అంటూ రాఖీలు కట్టుకున్నారు. కార్యక్రమంలో పద్మశాలి కుల బంధువులు భక్తులు పాల్గొన్నారు.

# నాగారం డివిజన్ అభివృద్ధికి రాధిక గుప్తాకి భూమయ్య యాదవ్ వినతి పాల్గొన్నా జీవన్ రెడ్డి..




మేడ్చల్ జిల్లా నిర్భయవార్త ప్రతినిధి : ఉప్పల్ జోనల్ ఘాట్కేసర్ సర్కిల్ నాగారం డివిజన్‌లో పలు అభివృద్ధి పనులపై జోనల్ కమిషనర్ రాధికా గుప్తా, ఐఏఎస్ ని నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూమయ్యా యాదవ్, నాయకులు జీవన్ రెడ్డి, కలిసి చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా నాగారం డివిజన్ పరిధిలో డ్రైనేజీ సమస్యలు, సీసీ రోడ్లు, స్ట్రీట్ లైట్లు, తాగునీటి సమస్యలు తదితర మౌలిక వసతుల అభివృద్ధిపై వివరంగా చర్చించి, ప్రజల అవసరాలకు అనుగుణంగా త్వరితగతిన అభివృద్ధి పనులు చేపట్టాలని నాగారం డివిజన్ అధ్యక్షులు ఎల్లసాని భూమయ్య యాదవ్ కోరడం జరిగింది.నాగారం డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని రాధికా గుప్తా, ఐఏఎస్ ని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో కౌకట్ల జీవన్ రెడ్డి , ప్రవీణ్ పాల్గొన్నారు.

# నూతన గృహప్రవేశానికి హాజరైన కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

## రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపిన కుటుంబ సభ్యులు



**మెదక్ టౌన్ :-** నిర్భయవార్త ప్రతినిధి : నిజాంపేట మండలంలోని నస్కల్ గ్రామానికి చెందిన మెట్టు విజయలక్ష్మి--సిద్ధిరాములు దంపతుల నూతన గృహప్రవేశ మహోత్సవ కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠారెడ్డి. తిరుపతిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొని, వేదపండితుల ఆశీర్వాదాలు తీసుకున్నారు. అనంతరం నూతన గృహ యజమానులు విజయలక్ష్మి--సిద్ధిరాములు దంపతులను అభినందించి, వారి కుటుంబానికి సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు.నూతన గృహప్రవేశానికి వచ్చిన సందర్భంగా కంఠారెడ్డి తిరుపతిరెడ్డి కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా ముచ్చటించారు. గ్రామస్తులు, బంధువులు, కుటుంబ సభ్యులతో కలిసి కొంతసేపు సంతోషంగా గడిపారు. నూతన ఇంటి నిర్మాణం, కుటుంబ సభ్యుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధువులు ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికారు.

**రాఖీ కట్టి ఆప్యాయత చాటిన కుటుంబ సభ్యులు.**

రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని విజయలక్ష్మి, కుటుంబ సభ్యులు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డికి రాఖీ కట్టి శు భాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి సందర్భంగా రాఖీ కట్టిన కుటుంబ సభ్యులను తిరుపతిరెడ్డి ఆప్యాయంగా అభినందించారు. అనంతరం కుటుంబ సభ్యులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు.కుటుంబ సభ్యులతో కలిసి రాఖీ పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న తిరుపతిరెడ్డి, రాఖీ పండుగ ప్రాధాన్యతను గుర్తుచేస్తూ ప్రతి కుటుంబంలో సోదర సోదరీమణుల మధ్య ప్రేమానురాగాలు మరింత బలపడాలని ఆకాంక్షించారు. నూతన గృహప్రవేశం, రాఖీ పౌర్ణమి వేడుకలు ఒకేసారి జరగడంతో నస్కల్ గ్రామంలోని మెట్టు విజయలక్ష్మి--సిద్ధిరాములు కుటుంబంలో సందడి నెలకొంది. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి అండ

## అనారోగ్యంతో ఉన్న వ్యక్తికి రూ.10 వేల సాయం..


## మృతుల కుటుంబాలకు రూ.20 వేల ఆర్థిక సహాయం.



**మెదక్ టౌన్ :-** నిర్భయవార్త ప్రతినిధి : కష్టాల్లో ఉన్న బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి అండగా నిలిచారు. నిజాంపేట మండలం బచ్చురాజుపల్లి గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తిని, ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన కుటుంబాలను ఆయన పరామర్శించి ఆర్థికసాయం అందించారు.గ్రామానికి చెందిన గంగమ్మ ఆంజనేయులు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న తిరుపతిరెడ్డి ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, అవసరమైన సమయంలో అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఇటీవల రోడ్డు ప్రమాదం, అనారోగ్యంతో మృతిచెందిన కుటుంబాలను కూడా తిరుపతిరెడ్డి పరామర్శించారు. సుంచు స్వామి, దుర్గోల నీలయ్య, సుంచు ప్రేమ్‌రావు, బోడబట్ల మల్లయ్య కుటుంబాలకు రూ.5 వేల చొప్పున మొత్తం రూ.20 వేల ఆర్థికసాయం అందించారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చి, కష్టకాలంలో వారికి అండగా ఉంటామని తెలిపారు.ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా తమ వంతు సహాయ సహకారాలు అందించేందుకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉ ంటారని తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమాల్లో కల్వకుంట సర్పంచ్ అందె. కొండల్‌రెడ్డి, రజాక్ పల్లి సర్పంచ్ కనకరాజు నిజాంపేట్ పట్టణ పార్టీ అధ్యక్షులు. చలమేటి నాగరాజు, మండల యువజన అధ్యక్షుడు మావురం రాజు, ఏడుపాయల ఆలయ మాజీ చైర్మన్ బాలాగౌడ్,మాజీ సర్పంచ్ సంగు స్వామి, వార్డు సభ్యుడు పంపరి నగేశ్, నాయకులు లచ్చపేట రాములు గౌడ్,తాడెం మల్లేశం, నారా గౌడ్ వెంకటేష్, రాజునాయక్, నరేందర్ నాయక్, పరశురాములు,సుభాష్ నాయక్, ఎల్లం యాదవ్, మంగలి నర్సింలు, ఉపసర్పంచ్ రాజశేఖర్, గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్, వార్డు సభ్యులు బాలమల్లేశం, మల్లేశం, రాజు, స్వామి, లింగం, సుధాకర్, ప్రభాకర్, రామచంద్రం, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



# సదాశివపేటఅన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి పవిత్రమైన రక్షాబంధన్ పండుగ ఘనంగా నిర్వహించారు



**సదాశివపేట** నిర్భయవార్త ప్రతినిధి : సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో అన్న చెల్లెళ్ళ అనుబంధానికి ప్రతీకగా నిలిచే పవిత్రమైన రక్షాబంధన్ పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించాలని వీరశైవ లింగాయత్ సమాజం జిల్లా సలహాదారు, సదాశివపేట సమాజం కార్యనిర్వాహక అధ్యక్షులు అనిమిశెట్టి జయప్రకాశ్ అన్నారు. రక్షాబంధన్ సందర్భంగా ఆయన మాట్లాడుతూసోదరీమణులు తమ సోదరులకు రాఖీ కట్టి, వారి ఆయురారోగ్యాలు సుఖసంతోషాలను కోరుకుంటారని తెలిపారు. సోదరులు తమ సోదరీమణులకు అండగా నిలుస్తామని, జీవితాంతం రక్షణగా ఉ ంటామని హామీ ఇవ్వడం ఈ పండుగ ప్రత్యేకత అని పేర్కొన్నారు రక్షాబంధన్ పండుగ కుటుంబ సభ్యుల మధ్య ప్రేమ ఆప్యాయత, అనురాగాలను మరింత బలపరుస్తుందని, భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెబుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ రక్షాబంధన్‌ను సంతోషంగా జరుపుకొని, సోదర--సోదరీమణుల మధ్య ప్రేమానుబంధాలను మరింత పెంపొందించుకోవాలని కోరారుఈ కార్యక్రమంలో అమ్మిశెట్టి వీర్‌కుమార్ సాయి, బత్తుల రాజు తదితరులు పాల్గొన్నారు.

# అంతిమవైద్యమే లక్ష్యం



తిరుపతి, నిర్భయవార్త ప్రతినిధి :తిరుపతి తిరుమల బైపాస్ రోడ్డు నందలి ప్రకాశం మునిసిపల్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గోపీనాథ్ అధ్వర్యంలో రుయా హాస్పిటల్ మరియు రోటరీ క్లబ్ సంయుక్తంగా రుయా హాస్పిటల్ నందు పలియేటివ్ కేర్ అనే విభాగాన్ని సేవే లక్ష్యంగా గతవారం ప్రారంభించారు. నయంకాని రోగాలు మరియు జబ్బులు కలిగిన వారికి ప్రముఖ వైద్య బృందం మరియు సర్వీస్ వాలంటీర్ చే అంతిమదిశలో మెరుగైన ఉపశమన వైద్యాన్ని అందిస్తున్నట్లు రుయా మాజీ సూపరిడెంట్ డా. భారతి మరియు మెడికల్ కాలేజ్ మాజీ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ లు తెలిపారు. తరువాత గోవిందాధామం వ్యవస్థాపక అధ్యక్షులు టెంకాయల దామోదరం మాట్లాడుతూ అంతిమసేవే లక్ష్యంగా దీనిని ప్రారంభించామని దీనికి వాకర్స్ అసోసియేషన్ సహకారం చాలా అవసరం ఉందని పేర్కొన్నారు.సేవాగుణం ఉన్న వారికి సర్టిఫికెట్ తో కూడిన ప్రత్యేక శిక్షణను అందించి మెరుగైన సేవలను రోగులకు అందజేసేందుకు అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. తరువాత వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధి ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ మానవసేవయే మాధవసేవలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి వాకర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రుయా మాజీ సూపరిడెంట్ డా. భారతి, డా. చంద్రశేఖర్, గోవిందాధామం వ్యవస్థాపకులు దామోదరం, వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధి ఆర్కాట్ కృష్ణప్రసాద్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గోపీనాథ్, దాస్, మునిరత్నం, జగన్నాధం,వెంకట్రామి చెట్టి , సుదర్శనం చెట్టి, బలరామి రెడ్డి, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

# అన్నా చెల్లెళ్ళ అనుబంధానికి ప్రతీక రాఖీ పౌర్ణమి.

హుకుంపేట,అల్లూరి జిల్లా, నిర్భయవార్త ప్రతినిధి : అల్లూరి జిల్లా హుకుంపేట మండల కేంద్రంలో రక్షా బంధన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కాచెల్లెళ్లు, సోదరులు రాఖీలు కట్టుకుని పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. రక్షా బంధన్ సోదర, సోదరీమణుల మధ్య ప్రేమ, అనురాగం, ఆత్మీయతకు ప్రతీకగా నిలుస్తుందని పలువురు పేర్కొన్నారు.కార్యక్రమంలో పాల్గొన్న వారు రాఖీలు కట్టుకుని స్వీట్లు పంచుకున్నారు. సోదరీసోదరుల మధ్య అనుబంధాన్ని మరింత బలోపేతం చేసేలా రక్షా బంధన్



వేడుకలు నిర్వహించడం ఆనందంగా ఉందని అన్నారు. కుటుంబ సభ్యులు, స్థానికులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# భక్తుల భద్రత ధ్యేయంగా...

### తిరుమలలో నాకాబందీ...

తిరుమల, నిర్భయవార్త ప్రతినిధి :త్వరలో జరిగే శ్రీవారి బ్రహ్మోత్సవాలను



దృష్టిలో ఉంచుకుని తిరుమలలో భద్రతా చర్యలను మరింత ముమ్మరం చేయడంలో భాగంగా శుక్రవారం తిరుమల బాలాజీ నగర్‌లో నాకాబందీ కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారి మురళీకృష్ణ ఆదేశాల మేరకు, తిరుమల అదనపు ఎస్పీ సూచనలతో, తిరుమల డీఎస్పీ పర్యవేక్షణలో ఈ తనిఖీలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో పోలీస్, టీటీడీ విజిలెన్స్, ఏపీ ఫారెస్ట్, టీటీడీ ఫారెస్ట్, ఫైర్, టీటీడీ రెవెన్యూ, రెవెన్యూ, బాంబ్ డిస్పోజల్ టీమ్స్, ఎక్సైజ్, హెల్త్ శాఖలకు చెందిన సుమారు 70 మంది సిబ్బంది నాలుగు బృందాలుగా ఏర్పడి బాలాజీ నగర్ ప్రాంతంలో ఏకకాలంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని టీటీడీ ద్వారా కేటాయించబడిన వ్యక్తులే ఆయా నివాసాల్లో ఉంటున్నారా? కొత్తగా ఎవరైనా వచ్చి నివాసం ఉంటున్నారా? అనే అంశాలతో పాటు ప్రతి శాఖకు సంబంధించిన అంశాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల్లో భాగంగా 670 ఇళ్లను తనిఖీ చేసి, సరైన గుర్తింపు కార్డులు లేని 27 మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. 160 వాహనాలను తనిఖీ చేసి రూ.41,380 విలువైన పాత చలానాలను రికవరీ చేయడంతో పాటు, గుర్తింపు లేని 3 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు స్థానికులతో సమావేశమై, అపరిచిత వ్యక్తులకు తమ నివాసాలను అద్దెకు ఇవ్వవద్దని, సరైన గుర్తింపు వివరాలు, నేర చరిత్రను తెలుసుకోకుండా ఎవరినీ పనిలో నియమించుకోవద్దని సూచించారు.తిరుమలలో కొత్తగా లేదా అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తున్నట్లు గుర్తించినప్పుడు వారి వివరాలను వెంటనే స్థానిక పోలీసులకు లేదా టీటీడీ విజిలెన్స్ అధికారులకు తెలియజేయాలని కోరారు. తిరుమల పవిత్రతకు భంగం కలిగించే విధంగా ఎవరూ వ్యవహరించరాదని, రాబోయే శ్రీవారి బ్రహ్మోత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు స్థానికులు పోలీసు, టీటీడీ యంత్రాంగానికి సహకరించాలని అధికారులు సూచించారు...

# సంబంధం స్వామి భూ భోగాతాలపై విచారణ సమగ్ర విచారణ జరిపించాలని సిపిఐ డిమాండ్.

శ్రీకాళహస్తి, నిర్భయవార్త ప్రతినిధి : తొట్టంబేడు మండలం చిట్టత్తూరు రెవెన్యూలో శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంలో పనిచేస్తున్న సంబంధం స్వామి భూ భోగా తలపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపించాలని సిపిఐ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గం కార్యదర్శి జనమాల గురవయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు భూమికోసం భుక్తి కోసం ఈ దేశ విముక్తి కోసం నిత్యం ప్రజలతో మమేకమై ప్రజల పక్షాన నిలబడి ప్రజా పోరాటాలు నడిపిస్తున్న సిపిఐ డిమాండ్ల మేరకు , పేద ప్రజలకు భూములు ఇవ్వండి ఇళ్ల పట్టాలి ఇవ్వండి స్మశాన స్థలాలు కేటాయించండి అని పదేపదే కోరుకున్న కదలక లేని రెవెన్యూ సిబ్బంది కలిగినోళ్ళకు దాసోకమై కాగితాలు మార్చేస్తుంటే స్థానికంగా ఉన్నటువంటి భూమిలేని నిరుపేదలు భూములు కోసం ఎన్నో పర్యాయాలు అర్జీలు ధర్నాలు తాశీల్దార్ కార్యాలయం ఎదుట చేసిన ఫలించని ఫలితం తొట్టంబేడు రెవిన్యూ అధికారులు రెవిన్యూ రికార్డులను తారుమారు చేసి అనువంశిక హక్కులను కల్పించడంలో కీలక పాత్ర పోషించినటువంటి ఘనత



ఎవరిదో నిగ్గు తేల్చవలసిన సిపిఐ కఠినంగా డిమాండ్ చేస్తుంది తమ సొంత ఆస్తుల లాగా డబ్బు ఇచ్చిన వారికి రాసి ఇచ్చినట్టు జరుగుతున్న ఈ రోజుల్లో ఈ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు కోట్ల రూపాయలు విలువ చేసేటటువంటి ప్రభుత్వ భూములను కాపాడాల్సినటువంటి రెవెన్యూ అధికారులే అవతల వ్యక్తులకు ప్రభుత్వ భూములను దారా దత్తం చేయడం ఎంతవరకు సమంజసమన్నారు ఇప్పటికైనా సంబంధం స్వామి భూ భోగాతాలపై సమగ్రమైనటువంటి విచారణ జరిపి ఆ భూమిని రెవిన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు,లేని పక్షంలో పోరాటమే ప్రజలే తుది తీర్పు న్యాయమూర్తులుగా వ్యవహరించగ తప్పదని సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో స్థానికంగా ఉన్నటువంటి పేదలకు పంచుతామన్నారు.

# మన 49వ డివిజన్లో చిన్న చిన్నసమస్యలను పరిష్కారంచూపుతున్న వ్యక్తి." అడ్డూరి తమ్మా రావుకి మన సమస్యలనుతెలుపుకుందాం.

నిర్భయవార్త ప్రతినిధి ,: ఎన్టీఆర్ జిల్లా విజయవాడ పశ్చిమ నియోజకవర్గం.49; డివిజన్ ప్రజానీకానికి ముఖ్య



విషయం. స్థానిక ప్రజలు గమనించండి.. మన డివిజన్లో మనకు ఉన్న సమస్యలు మనకు ఎదురయ్యే చిన్న చిన్న సమస్యలు మన డివిజన్లో సమస్య పరిష్కారం అవ్వాలంటే. మనకు అందుబాటులో ఉండే వ్యక్తి.. మనకి దగ్గర్లో నిత్యం పిలిస్తే పలికే వ్యక్తి అయి ఉండాలి. పార్టీలతో సంబంధం లేకుండా సమస్యలు పరిష్కరించే వ్యక్తి ఉండాలి . మనలాగే మనలో ఉండే మధ్య తరగతి వ్యక్తే ఉండాలి అప్పుడే డివిజన్లో ప్రజలు చెప్పిన సమస్యలను పరిష్కరించగలుగుతారు.. డివిజన్ లో ఉన్న పేద మధ్య తరగతి ప్రజల సమస్యలపై అవగాహన ఉండిద్ది అటువంటి వ్యక్తికి పేద మధ్యతరగతి ప్రజల కష్టసుఖాలు అర్థమవుతాయి. కాబట్టి మన డివిజన్లో ఉన్న స్థానిక సమస్యలను పరిష్కరించే వ్యక్తిని గుర్తిద్దాం.. అటువంటి వ్యక్తికి ప్రతి సమస్యను తెలియజేద్దాం ఆ సమస్యను పరిష్కరించే దశగా. ఆ వ్యక్తితో చేయించుకుందాం..49వ డివిజన్లో నిరంతరం ప్రజల సమస్యలను తెలుసుకొని అధికారులు దృష్టికి తీసుకెళ్లి ఆ సమస్య పరిష్కార అయ్యేవరకు. మళ్లీ మళ్లీ అధికారులు పిలిపించి సమస్యను పరిష్కారం చేస్తున్న వ్యక్తి మన డివిజన్లలో సేవకులుగా సైనికుడిగా ఉన్న వ్యక్తి అడ్డూరి తమ్మారావు కి మన 49వ డివిజన్ లో ఉన్న.. కాలవలు.. కరెంటు.. తాగునీరు.. డ్రైనేజీ వంటి సమస్యలనుతెలుపుదా... 49 వ డివిజన్లలో మీ సేవలో ..భోగవల్లి హనుమంతు. వినుకొండ వేబేలు. రావిలి శెట్టి అశోక్. బంక కనకారావు. పానక వెంకట్రావు. బాణికం గోపి . వెంకన్న . గంధం కుమార్...

# అన్ని స్థానాల్లో పోటీ చేస్తాం..

### అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి.

కోవూరు, నిర్భయవార్త ప్రతినిధి :స్థానిక సంస్థల ఎన్నికలపై వైసీపీ దూకుడు పెంచింది.అన్ని స్థానాల్లో పార్టీ పోటీ చేస్తుందని మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రకటించారు.కోవూరు పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని అధికారులను కోరారు.అధికార పార్టీ ఒత్తిళ్లకు అధికారులు తలొగ్గరాదని సూచించారు.కొన్ని మండలాల్లో అధికారులు వైసీపీ నేతలను భయపెడుతున్నారనే ఆరోపణలు వచ్చాయని తెలిపారు.రౌడీషీట్లు పెడతామని బెదిరిస్తున్నారనే ఫిర్యాదులు తమ దృష్టికి వచ్చాయన్నారు.కొంతమంది పోలీసులు అధికార పార్టీకి



అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు."ఖాకీ బట్టలు విప్పేసి పసుపు చొక్కాలు వేసుకోండి" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు."వచ్చేది మా ప్రభుత్వమే.. జాగ్రత్తగా వ్యవహరించండి" అంటూ హెచ్చరిక ధోరణిలో మాట్లాడారు.అయితే అధికారులు తమ ఆరోపణలను వాస్తవాల ఆధారంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.ప్రతి పార్టీకి, అభ్యర్థికి సమాన అవకాశాలు కల్పించాలని ఆయన కోరారు.గత ఎన్నికలపై ప్రజల్లో అనుమానాలు ఉన్నాయని ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు.రాబోయే స్థానిక ఎన్నికల్లో బ్యాలెట్ ద్వారా ప్రజలు తీర్పు ఇస్తారని పేర్కొన్నారు.

# కౌన్సిల్ సమావేశం.. ప్రజా సమస్యలకు పరిష్కారం దొరికేనా?

బుచ్చిరెడ్డిపాలెం,నిర్భయవార్త ప్రతినిధి :నేడు జరగనున్న మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంపై పట్టణంలో ఆసక్తి నెలకొంది.ప్రజా సమస్యలపై చర్చ




జరుగుతుందా? లేక రాజకీయ ఆరోపణలకే సమావేశం పరిమితమవుతుందా? అనే చర్చ సాగుతోంది.తాగునీరు, పారిశుద్ధ్యం, డ్రెయినేజీ సమస్యలను కౌన్సిలర్లు ప్రస్తావించే అవకాశం ఉంది.ఓటర్ల నమోదు ప్రక్రియలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు కూడా సమావేశంలో చర్చకు వచ్చే అవకాశం కనిపిస్తోంది.అభ్యంతరాలున్న ఓట్లకు నోటీసుల జారీలో జాప్యంపై అధికారులను నిలదీసే అవకాశం ఉంది.నోటీసుల జాప్యానికి కారణాలేమిటన్న దానిపై స్పష్టత కోరనున్నట్లు తెలుస్తోంది.ఐరన్ స్క్రాప్ విక్రయాల వ్యవహారంలో వచ్చిన ఆరోపణలు మరోసారి తెరపైకి వచ్చే అవకాశం ఉంది.శానిటరీ విభాగంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమాలపై విచారణ పురోగతిని ప్రశ్నించనున్నారు.బాధ్యులపై చర్యలు తీసుకున్నారా? అనే ప్రశ్నకు అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది..అయితే రాజకీయ విమర్శలకంటే ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం ఇవ్వాలని పట్టణవాసులు కోరుతున్నారు.ప్రతి అంశంపై స్పష్టమైన సమాధానం ఇవ్వాలని ప్రజలు ఆశిస్తున్నారు.వార్డు రిజర్వేషన్ మార్పే బేరసారాల పత్రిక కథనాలపై చర్చకు వచ్చే అవకాశం . రిజర్వేషన్ బూచి చూపించి కొందరి కౌన్సిలర్లను నోరుమూపించే పనిలో అధికారులు ఉన్నట్లు తెలుస్తోంది.పెండింగ్ సమస్యలు,బిల్లులపై కాలపరిమితితో పరిష్కారం చూపుతారా అన్నదే కీలకంగా మారింది.కౌన్సిల్ సమావేశం ప్రజల గొంతుకగా మారుతుందా? అన్నది వేచి చూడాలి.ఆరోపణలు--ప్రత్యారోపణలకే పరిమితమైతే ప్రజలకు ప్రయోజనం ఏమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.ప్రజాధనం, ప్రజా సమస్యలపై జవాబుదారీతనం ఉండాలని పట్టణవాసులు కోరుతున్నారు.అధికారులు వాస్తవాలను వెల్లడిస్తారా? కౌన్సిలర్లు ప్రశ్నలకు కట్టుబడి ఉంటారా? అన్నది ఆసక్తికరం.మాటలకే పరిమితం కాకుండా తీర్మానాలు, చర్యలు కనిపించాలన్నది ప్రజల డిమాండ్.నేటి సమావేశం తర్వాత అయినా ప్రజలకు సమాధానాలు దొరుకుతాయా? లేక ప్రశ్నలు మిగిలిపోతాయా?

# విజేత ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు.

నెల్లూరు జిల్లా, నిర్భయవార్త ప్రతినిధి :నెల్లూరు జిల్లా పొదలకూరు విజేత ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు రాఖీ పౌర్ణమి సందర్భంగా రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల కరస్పాండెంట్ గంగవరపు కామాక్షి పాల్గొని విద్యార్థులకు రాఖీ పౌర్ణమి విశిష్టతను,అన్నాచెల్లెళ్ల మధ్య ఉండే ప్రేమ, ఆప్యాయత, అనుబంధం గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకుని పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఉపాధ్యాయులు కూడా ఈ వేడుకల్లో పాల్గొని విద్యార్థులను ఆశీర్వదించారు. సోదర--సోదరీమణుల



అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి ప్రతి ఒక్కరి జీవితాల్లో ప్రేమ, ఆనందం, సంతోషాలను నింపాలని ఆకాంక్షిస్తూ విజేత ఇంగ్లీష్ మీడియం స్కూల్ కుటుంబం తరఫున ఆమె రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు

# కంచికచర్ల మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ (ఆయా) వర్కర్లకు 4 నెలలుగా పెండింగ్లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలి.



కంచికచర్ల, నిర్భయవార్త ప్రతినిధి :కంచికచర్ల మండల ఎంఈఓ బాలాజీ కి వినతిపత్రం అందిస్తున్న సిఐటియు నాయకులు ఈ సందర్భంగా కంచికచర్ల మండల నాయకులు గోపినాయక్ మాట్లాడుతూ కంచికచర్ల మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో శానిటేషన్ వర్కర్స్ అనేక మంది పనిచేస్తున్నారు. పాఠశాల పరిసరాలను, మరుగుదొడ్లను శుభ్రం చేస్తూ ప్రాంగణంలో పారిశుధ్య పనులు నిర్వహిస్తూ విద్యార్థులు అనారోగ్యం పాలుకాకుండా కాపాడటంలో ముఖ్య పాత్ర వహిస్తున్నారు.అత్యంత కీలకమైన విధులు నిర్వహిస్తున్న వీరికి అతి తక్కువ వేతనం ఇచ్చి పనిచేయిస్తున్నారు.ఇచ్చే అరాకొరా వేతనం కూడా గత 4 నెలల నుంచి పెండింగ్లో ఉంది.దీనితో వీరి కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయి.శానిటేషన్ కార్మికులందరూ కూడా దళిత,వెనుకబడిన తరగతులకు చెందిన పేద మహిళలే.కావున వీరి పరిస్థితిని అర్థం చేసుకుని బకాయి ఉన్న 4 నెలల వేతనాలు వెంటనే ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని మరియు ప్రతి నెలా మొదటి వారంలో క్రమం తప్పకుండా వేతనాలు చెల్లించేలా చూడాలని ఆయన అన్నారు..ఈ కార్యక్రమంలో సిఐటియు కంచికచర్ల మండల నాయకులు బెజ్జం భూషణం,శానిటేషన్ కార్మికులు యశోద,రోజా, శీనమ్మ,రఘు, నాయకులు తదితరులు పాల్గొన్నారు..

# లంచం తీసుకుంటూ ఇరిగేషన్ అధికారులు పట్టుబాటు.



నిర్భయవార్త ప్రతినిధి : నెల్లూరులో అవినీతి నిరోధక శాఖ అధికారులు ఇరిగేషన్ శాఖకు చెందిన ముగ్గురు అధికారులను అదుపులోకి తీసుకున్నారు. రైతు నుంచి రూ.3 లక్షల లంచం తీసుకుంటుండగా ఈఈ మహేష్, డీఈ గౌతమ్ సుమన్, ఏఈ ఎం. నారాయణరాజును రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు సమాచారం.కలువాయి మండలం మద్దూరిపల్లికి చెందిన రైతు అంబటి చిరంజీవి తన పొలం వద్ద ఉన్న ఇరిగేషన్ కాలువపై కల్వర్టు నిర్మాణానికి అనుమతి కోరగా అధికారులు రూ.4 లక్షలు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.ఈ ఘటనపై ఏసీబీ అధికారులు తదుపరి విచారణ కొనసాగిస్తున్నారు.

# ప్రభాస్ కంటే నేనే గొప్పంటున్న దీపిక

స్పిరిట్ సినిమాకు మొదట కథానాయికగా ఎంపికైన దీపిక పదుకొనే.. తర్వాత ఆ సినిమా నుంచి తప్పుకోవడం మీద దాదాపు రెండేళ్లుగా వివాదం నడుస్తున్న సంగతి తెలిసిందే. స్పిరిట్ సినిమాకు మొదట కథానాయికగా ఎంపికైన దీపిక పదుకొనే.. తర్వాత ఆ సినిమా నుంచి తప్పుకోవడం మీద దాదాపు రెండేళ్లుగా వివాదం నడుస్తున్న సంగతి తెలిసిందే. మధ్యలో గొడవ సద్దుమణిగినట్లే కనిపించినా.. ఇటీవల ఈ చిత్ర నిర్మాతల్లో ఒకరైన ప్రణయ్ రెడ్డి వంగ (సందీప్ రెడ్డి సోదరుడు) ఒక ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలతో మళ్లీ అగ్గి రాజుకుంది.



దీపిక సినిమా లాభాల్లో పది శాతం వాటా కింద అడిగిందని.. ఇంకా కొన్ని కండిషన్లు పెట్టిందంటూ అతను చెప్పాడు. దీంతో సోషల్ మీడియాలో మరోసారి దీపిక మీద నెటిజన్లు విరుచుకుపడ్డారు అనే ప్రచారానికి మెగా బాస్ కౌంటర్ ఇదేనా? అలా అని దీపిక టీం కూడా ఏమీ తగ్గలేదు. తన పీఆర్ టీంను, జర్నలిస్టులను సందీప్ అండ్ టీమ్ మీద దీపిక ఉసిగొల్పి ఎటాక్ చేయించినట్లు సోషల్ మీడియా పోస్టులను బట్టి చూస్తే అర్థమైంది. ఐతే దీపిక ఈ వ్యవహారాన్ని అంతటితో వదిలిపెట్టట్లేదు. తాజాగా ఒక కార్యక్రమంలో దీపిక.. 'స్పిరిట్' టీం మీద పరోక్షంగా విమర్శలు గుప్పించింది. ఫిలిం ఇండస్ట్రీలో పురుషులు, మహిళల మధ్య పారితోషకాల్లో అంతరం గురించి ఆమె మాట్లాడుతూ.. ఒక సినిమా విషయంలో ఎదురైన అనుభవాన్ని పంచుకుంది. ఆ సినిమాలో నటిస్తున్న స్టార్ హీరోకు టీం ఒక పారితోషకాన్ని ఫిక్స్ చేశారని.. ఆ నంబర్ ఎంత అన్నది తనకు తెలుసని.. కానీ ఆ హీరో కంటే తాను ఎక్కువ సక్సెస్ ఫుల్ అని తాను భావిస్తానని.. అతడి కంటే ఎక్కువ సినిమాల్లో నటించానని దీపిక పేర్కొంది. కాబట్టి తనకు ఇంత పారితోషకం ఇవ్వాలని అని కోట్ చేయగా.. తాము హీరోకు ఇంత డబ్బులు ఇస్తున్నామని, నీకివ్వడానికి మా దగ్గర అంత డబ్బు లేదు అని చెప్పారని దీపిక వెల్లడించింది. దీంతో సరే అని తాను ఆ సినిమా నుంచి తప్పుకున్నానని దీపిక చెప్పింది.ఆ సినిమా పేరేదో చెప్పండి అంటే తాను అలా చెప్పే రకం కాదని దీపిక అంది. పారితోషకాల విషయంలో హీరోయిన్లు ఎందుకు మరి పట్టుదలగా ఉండరు అని అడిగితే.. అవకాశం పోతుందనే భయంతో రాజీ పడతారని దీపిక పేర్కొంది. ఐతే ఈ వ్యాఖ్యల మీద సోషల్ మీడియాలో గట్టిగానే వ్యతిరేకత వస్తోంది. స్పిరిట్ అని పేరు చెప్పకపోయినా.. ఆమె మాట్లాడింది 'స్పిరిట్' సినిమా గురించే అన్నది స్పష్టం. ప్రభాస్ కంటే తానే పెద్ద స్టార్, తన మార్కెటే ఎక్కువ అన్నట్లు దీపిక మాట్లాడ్డంతో రెబల్ ఫ్యాన్స్‌తో పాటు తెలుగు ప్రేక్షకులు ఆమె మీద మండిపడుతున్నారు.

# 'మనం' దృశ్యంలో అక్కినేని పెద్ద కోడలు

వీడియో కింద వచ్చిన ప్రతిస్పందనల్లో ఎక్కువ భాగం ఈ దృశ్యాలను బంధించిన కెమెరామన్ ప్రతిభను అభినందించడానికే ప్రాధాన్యత ఇచ్చాయి. టాలీవుడ్ ప్రముఖ కథానాయకుడు అక్కినేని నాగార్జున జన్మదిన వేడుకల సందర్భంగా అక్కినేని కుటుంబ సభ్యులు ఒకే ఫ్రేమ్‌లో కనిపించి అభిమానులను అలరించారు. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద నాగార్జున- అమల, నాగచైతన్య - శోభిత ధూళిపాళ కలిసి ప్రయాణం అవుతున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.



కుటుంబ సభ్యులందరూ ఎంతో ఆనందంగా.. ఒకరికొకరు ఆప్యాయంగా తోడు నీడగా కనిపిస్తూ విమానాశ్రయం వైపు అడుగులు వేయడం అభిమానులకు ఎంతో సంతోషాన్ని కలిగించింది. అనే ప్రచారానికి మెగా బాస్ కౌంటర్ ఇదేనా? అక్కినేని కుటుంబంలో కొత్త అధ్యాయం ప్రారంభమైన తర్వాత.. కుటుంబ సభ్యులందరూ ఇలా ఒకే చోట కలవడం అభిమానులకు ప్రత్యేకమైన దృశ్యంగా మారింది. నాగచైతన్య -శోభిత జంటగా కనిపించడం.. అమల - నాగార్జునల రాయల్ లుక్ వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. -కింగ్- బర్త్‌డే వేడుకలను ప్రత్యేకంగా జరుపుకోవడానికి వీరంతా కలిసి వెళ్తున్నారనే సమాచారం అక్కినేని అభిమానులలో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. సామాజిక మాధ్యమాల్లో ఈ వీడియో విడుదలైన నిమిషాల్లోనే వేలాది లైక్‌లు , కామెంట్లతో ట్రెండింగ్‌లోకి వచ్చింది. క్లాసిక్ చిత్రం -మనం-లోని భావోద్వేగమైన నేపథ్య సంగీతాన్ని ఈ వీడియోకు జోడించడంతో అభిమానులు పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. వీరిని ఒకే ఫ్రేమ్‌లో చూసిన నెటిజన్లు -అందమైన కుటుంబం- అని.. అక్కినేని వారసత్వం , బంధాలు ఎంతో అద్భుతంగా ఉన్నాయని ప్రశంసిస్తూ తమ శుభాకాంక్షలు తెలిపారు. వీడియో కింద వచ్చిన ప్రతిస్పందనల్లో ఎక్కువ భాగం ఈ దృశ్యాలను బంధించిన కెమెరామన్ ప్రతిభను అభినందించడానికే ప్రాధాన్యత ఇచ్చాయి. సెలబ్రిటీల వ్యక్తిగత జీవితాలలోని ఇటువంటి ఆనందకరమైన ఘట్టాలను అభిమానులకు చేరువ చేయడం విశేషమని కొందరు కామెంట్ చేశారు. శోభిత ధూళిపాళ అక్కినేని కుటుంబంలోకి అడుగుపెట్టిన తీరు.. తన ఫ్యాషన్ సెన్స్- పద్ధతులపై చాలామంది సానుకూలంగా స్పందిస్తూ శుభాకాంక్షలు అందజేశారు. నాగార్జున పుట్టినరోజు సందర్భంగా అక్కినేని కుటుంబం ప్రదర్శించిన ఈ ఐక్యత, అనుబంధం సోషల్ మీడియాలో ఒక వేడుకలా మారింది. వెండితెరపైనే కాకుండా నిజ జీవితంలోనూ ఎంతో కట్టుదిట్టమైన బంధాలతో మెలిగే ఈ ఫ్యామిలీని చూసి అభిమానులు మురిసిపోతున్నారు. రానున్న రోజుల్లో కూడా ఈ కుటుంబం ఇలాగే సంతోషంగా ఉండాలని... మరిన్ని మంచి విజయాలు సాధించాలని నెటిజన్లు ఆకాంక్షిస్తున్నారు. సమంత ఆ కుటుంబంతో లేకపోవడాన్ని కొందరు విమర్శించినా కానీ... అక్కినేని కుటుంబం -మనం- సీక్వెల్ లో నటించాలని కూడా కొందరు వ్యాఖ్యానిస్తున్నారు.

# తొక్కేస్తాడు! అనే ప్రచారానికి మెగా బాస్ కౌంటర్ ఇదేనా?

మాస్ మహారాజ్ తాజా సినిమా -ఇరుముడి-ని అభినందిస్తూ.. ఇప్పుడు మెగాస్టార్ చిరంజీవి చేసిన ఒక వ్యాఖ్య ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మాస్ మహారాజ్ తాజా సినిమా -ఇరుముడి-ని అభినందిస్తూ.. ఇప్పుడు మెగాస్టార్ చిరంజీవి చేసిన ఒక వ్యాఖ్య ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తనపై సాగిస్తున్న నెగెటివ్ ప్రచారాన్ని చిరు ఏవిధంగా సీరియస్ గా తీసుకున్నారో ఈ సన్నివేశం చెబుతోంది. అంతేకాదు తన ట్రోలర్స్ పై బాస్ చాలా సింపుల్ గా కౌంటర్ ఎటాక్ చేసారనే చర్చ సాగుతోంది. ఎక్స్ ఖాతాలో రవితేజపై అభినందనల ట్వీట్ చివర్లో చిరంజీవి రాసిన కొన్ని వ్యాఖ్యలు ప్రస్తుతం టాలీవుడ్‌లోనూ, సోషల్ మీడియాలోనూ హాట్ టాపిక్‌గా మారాయి. "ఒక సినిమా విజయం పరిశ్రమలోని అందరికీ పండుగ. ఈ పరిశ్రమ అందరిదీ... ఏ కొందరిదో కాదు.. మనం బతకాలి, .. ఇతరులను బతికించాలి"ని చిరు పేర్కొన్నారు. పైకి ఇది సాధారణ అభినందన సందేశంలా కనిపిస్తున్నా ఇటీవల తనపై జరుగుతున్న సోషల్ మీడియా దుష్ప్రచారానికి మెగాస్టార్ ఇచ్చిన గట్టి కౌంటర్‌గా ఒక సెక్షన్ మీడియా - నెటిజన్లు విశ్లేషిస్తున్నారు. ఇటీవల సోషల్ మీడియా వేదికగా చిరంజీవి ఇతరులను -తొక్కేస్తారు- అనే విధంగా (-బాస్ తొక్కేస్తాడు- అనే హ్యాష్‌ట్యాగ్‌తో) కొంతమంది నెటిజన్లు నెగెటివ్ క్యాంపెయిన్ నడపడం పెద్ద దుమారం రేపింది. సాధారణంగా సెలబ్రిటీల వ్యక్తిగత ఎమోషన్లను, వృత్తిపరమైన విషయాలను దెబ్బతీసేలా సోషల్ మీడియా ఏ విధంగా ప్రభావితం చేస్తుందో ఈ పరిణామం మరోసారి స్పష్టం చేసింది. ఇటువంటి కక్షపూరిత ప్రచారాలను ఏమాత్రం సహించని మెగాస్టార్.. తనదైన శైలిలోనే "ఈ పరిశ్రమ అందరిదీ.. కొందరిది మాత్రమే కాదు" అని స్పష్టం చేస్తూ ట్రోలర్ల నోళ్లు మూయించారని విశ్లేషకులు భావిస్తున్నారు.



అసలు చిరంజీవిపై ఇటువంటి తప్పుడు కూతలు కూయాల్సిన అవసరం ఏమొచ్చిందనేది సగటు సినీ ప్రేమికుడి ప్రశ్న. ఒకవేళ చిరంజీవిది వేరొకరిని తొక్కివేసే స్వభావమే అయితే... పరిశ్రమలోకి వచ్చే ఎందరో చిన్న హీరోలకు, యువ నటులకు తనవంతుగా సినిమాల ప్రమోషన్లు చేస్తూ ప్రోత్సహిస్తారా? గతంలో కూడా ఆయన దానధర్మాలు చేయరని కొందరు నెగెటివ్ ప్రచారం చేసినప్పుడు.. పబ్లిసిటీకి దూరంగా లక్షలాది రూపాయల విరాళాలు ఇస్తూ.. ఎంతోమందిని ఆదుకుంటూ ప్రాక్టికల్ గా చేతల ద్వారానే జవాబిచ్చారు. రక్తదానం, నేత్రదానం సహా పలు సామాజిక సేవా కార్యక్రమాల కోసం మెగాస్టార్ తన జీవిత కాలాన్ని వెచ్చిస్తున్న విషయం తెలిసిందే. మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా నటించిన -ఇరుముడి- చిత్రం బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ విజయాన్ని సాధించడంతో మెగాస్టార్ చిరంజీవి సోషల్ మీడియా వేదికగా చిత్రబృందాన్ని అభినందించారు. సినిమా మొదటి సన్నివేశం నుంచి చివరి వరకు ఎంతో ఆస్వాదించానని... త్రినాథ్ పాత్రలో రవితేజ అద్భుతంగా నటించారని కొనియాడారు.

# క్రేజీ బజ్.. శంకర్, మురుగదాస్ కాంబినేషన్లో సినిమా!?





తమిళ సినిమా దగ్గర ఉన్నటువంటి టాప్ మోస్ట్ దర్శకుల్లో శంకర్ అలాగే మురుగదాస్ అంటే తెలీని వారు ఉండరు. శంకర్ స్టార్ట్ చేసిన కమర్షియల్ సోషల్ డ్రామా స్టైల్ కి మరో వెర్షన్ లా మురుగదాస్ కూడా పలు కమర్షియల్ సినిమాలు చేసి పాన్ ఇండియా లెవెల్లో ఇద్దరూ మంచి ముద్ర వేసిన సంగతి అందరికీ తెలిసిందే.అయితే ఈ ఇద్దరూ ఇప్పుడు పూర్తి ఫామ్ లో లేరు. కానీ వీరి బ్రాండ్ పట్ల నమ్మకం మాత్రం చాలా మందిలో ఉంది. ఇక ఇదిలా ఉండగా ఓ క్రేజీ బజ్ ఇపుడు సినీ వర్గాల్లో వినిపిస్తోంది. ఈ ఇద్దరూ కలిసి ఓ సినిమా చేస్తే ఎలా ఉంటుంది? ఇప్పుడు ఇదే హాట్ టాపిక్ గా మారింది. ఇలాంటి కాంబినేషన్ లలో నిర్మాతలుగా ఏదన్నా సినిమా అనుకుంటే పొరపాటే..మురుగదాస్ ఇచ్చిన కథతో శంకర్ దర్శకత్వం వహించనున్నట్టు క్రేజీ రూమర్స్ ఇప్పుడు మొదలయ్యాయి. ఇక ఇందులో ఎంతమేరకు నిజం ఉందో కానీ ఈ టాక్ మాత్రం మూవీ లవర్స్ ని ఎగ్జైట్ చేస్తుంది. సో వీరి కాంబినేషన్ నిజంగా ఉందా లేదా అనేది కాలమే నిర్ణయించాలి.


# నైజాంలో 'ఇరుముడి' మొదటివారం వసూళ్లు ఎంతంటే!




మాస్ మహారాజ రవితేజ హీరోగా ప్రియా భవాని శంకర్ హీరోయిన్ గా దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కించిన ఎమోషనల్ థ్రిల్లర్ చిత్రమే 'ఇరుముడి'. మంచి అంచనాలు నడుమ వచ్చిన ఈ చిత్రం భారీ వసూళ్లు సాధించి రవితేజ కెరీర్ లోనే కాకుండా టాలీవుడ్ లోనే బిగ్గెస్ట్ హిట్స్ లో ఒకటిగా నిలిచింది.ఇలా మొదటి వారం రోజుల రన్ ని సక్సెస్ ఫుల్ గా పూర్తి చేసుకున్న ఈ చిత్రం నైజాం మార్కెట్ లో అదరగొట్టినట్టు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. లేటెస్ట్ పి ఆర్ లెక్కల ప్రకారం ఏడవ రోజు నైజాంలో 2.2 కోట్ల మేర షేర్ ని రాబట్టినట్టు తెలుస్తుంది.దీనితో 'ఇరుముడి' మొత్తం ఈ 7 రోజుల్లో 26 కోట్లకి పైగా షేర్ ని రాబట్టినట్టు పి ఆర్ లెక్కలు చెబుతున్నాయి. సో నైజాం మార్కెట్ లో ఇరుముడి సెన్సేషనల్ సక్సెస్ ని సాధించి ఇంకా స్ట్రాంగ్ రన్ ని కొనసాగిస్తుంది అని చెప్పవచ్చు. ఇక ఈ చిత్రానికి జీవి ప్రకాష్ కుమార్ సంగీతం అందించగా మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణం వహించారు.

# సూపర్ స్టార్ కి స్టోరీ చెప్పిన డ్యాషింగ్ డైరెక్టర్!

డ్యాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాద్ కు కొంత కాలంగా సరైన హిట్ లేకపోవడంతో? విజయం కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు డ్యాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాద్ కు కొంత కాలంగా సరైన హిట్ లేకపోవడంతో? విజయం కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలోనే మక్కల్ సెల్వన్ విజయ్ సేతోపతితో -స్లమ్ డాగ్ టెంపుల్ రన్- చిత్రాన్ని తెరకెక్కించి రిలీజ్ పనుల్లో ఉన్నారు. ఈ సినిమాపై పూరి చాలా ఆశలే పెట్టుకున్నారు. మంచి హిట్ ఇచ్చి స్ట్రాంగ్ కంబ్యాక్ ఇవ్వాలని చూస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా మరో ఇంట్రెస్టింగ్ విషయం నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఇటీవలే సూపర్ స్టార్ రజనీకాంత్‌కు పూరి ఓ లైన్ వినిపించారని కోలీవుడ్ మీడియాలో ప్రచారం జోరందుకుంది. అనే ప్రచారానికి మెగా బాస్ కౌంటర్ ఇదేనా? పూరి మార్క్ యాక్షన్ ఎలిమెంట్స్, రజనీ స్టైల్ అండ్ స్వాగ్‌కు సరిపోయేలా లైన్ ఉందని లీకులందుతున్నాయి. నిజంగానే ఈ కాంబినేషన్ సెట్ అయితే బాక్సాఫీస్ వద్ద ఏ రేంజ్ లో విధ్వంసం ఊహకే అందదు. పూరి జగన్నాథ్ సినిమాల్లో హీరోల పాత్రలు పదునుగా, భయం లేని బాడీ లాంగ్వేజ్‌తో ఉంటాయి. సూపర్ స్ టార్ వయసుతో సంబంధం లేకుండా దూసుకెళున్న తరుణంలో ఆయన ఇమేజ్‌కు తగినట్లుగా పూరి యూనిక్ క్యారెక్టరైజేషన్‌ను డిజైన్ చేసారంటే తిరుగుండదు. కథ విన్న తర్వాత రజనీ కూడా పాజిటివ్ గానే ఉన్నారని తెలిసింది. ప్రస్తుతంప్రచార దశలోనే ఉన్న వార్త సినిమా సర్కిల్స్‌లో మాత్రం సరికొత్త వైబ్రేషన్‌ను క్రియేట్ చేస్తోంది. ఒకవైపు రజనీకాంత్ వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లతో దూసుకుపోతుండగా మరోవైపు పూరి జగన్నాథ్ తనదైన మార్క్ కంబ్యాక్ కోసం ప్లాన్ చేస్తు న్నారు. ఇద్దరి కలయికలో సినిమా వస్తే మాత్రం అది ఇండియన్ సినిమా చరిత్రలో మరొక సంచలనంగా మారుతుందని ట్రేడ్ పండితులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఈ కాంబినేషన్ సెట్ అయితే రజనీకాంత్ ఉన్న పళంగా డేట్లు కేటాయిస్తారా? అన్నది సందేహమే. ఎందుకంటే రజనీ ఇప్పటికే కమిట్ అయిన కొన్ని ప్రాజెక్టులు పూర్తి చేయాల్సి ఉంది.ప్రస్తుతం అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో కమల్ హాసన్ నిర్మాణంలో తెరకెక్కుతోన్న -ధర్మన్- లో నటిస్తున్నారు. ఈ సినిమా అనంతరం కమల్ సహాసన్-రజనీకాంత్ మల్టీస్టారర్ చిత్రం పూర్తి చేయాల్సి ఉంది. వీటితో పాటు మరికొంత మంది ఫాంలో ఉన్న దర్శకుల కథల్ని రజనీ హోల్డ్ లో పెట్టారు. వాటికి సంబంధించి క్లారిటీ రావాల్సి ఉంది. వీటన్నింటి మధ్య పూరి కథను తెరకెక్కించాల్సి ఉంటుంది.



Edited, Printed, Published and Owned by Bavanari Ravi kumar. Printed at M/s Manikanta Enterprises, H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State.
Published at H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Editor: Bavanari Ravi Kumar. RNI No.TELTEL/2014/55197